ఈనాటి
# తెలుగోడు
PRGI-NO-APTEL/25/A2739
EENAATI TELUGODU... Telugu Daily
https://www.eenaatitelugodu.com

సంపుటి-1 | సంచిక - 167 | మంగళవారం 17 మార్చి 2026 | పేజీలు -8 | వెల - రూ.. 5

Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati

Ph:8368102842
నాశా క్లినిక్
డా.భానుప్రకాష్ MBBS
సంప్రదించు వేళలు: ఉ.7.30 నుంచి 8.30 వరకు
సా.4 గం.నుంచి రాత్రి.8.30 వరకు
డా.నిహారిక BHMS
సంప్రదించు వేళలు:
ఉ.9 గం. నుంచి సా.5 గం. వరకు
Ph:9704461510
మా మెడికల్స్
ఎమ్మార్వో ఆఫీస్ ఎదురుగా ఓ.డి.చెరువు

## త్యాగానికి శాశ్వత స్మారకంగా
# అమరజీవి విగ్రహం




- పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ ఓ చరిత్ర..
- స్టాచ్యూ ఆఫ్ శాక్రిఫైస్‌గా నామకరణం..
- అహింసా మార్గంలో ఆంధ్ర రాష్ట్ర సాధనకు కృషి..
- 58 రోజుల దీక్షకు గుర్తుగా 58 అడుగుల విగ్రహం..
- యువతకు స్పూర్తినిచ్చే స్మారక స్థలంగా అభివృద్ధి...
- తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి పొట్టి శ్రీరాములు ప్రాణత్యగం చిరస్మరణీయం..
- అమరావతిలో ఆవిష్కరించిన సిఎం చంద్రబాబు

**అమరావతి (తెలుగోడు), మార్చి 16 :**

అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ త్యాగానికి శాశ్వత స్మారకంగా నిలుస్తుందని సీఎం చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్‌గా నామకరణం చేశామని చెప్పారు. అహింసా మార్గంలో ఆయన ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించారని గుర్తు చేశారు. పొట్టి శ్రీరాముల త్యాగం ఈ తరం వాళ్లు తెలుసుకోవాలన్నారు. రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరులో అమరజీవి పొట్టి శ్రీరాముల 58 అడుగుల భారీ కాంస్య విగ్రహాన్ని సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, టీజీ భరత్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం అమరజీవి చేసిన 58 రోజుల ఆమరణ నిరాహార దీక్షకు గుర్తుగా ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తుళ్లూరు సమీపంలో 6.8 ఎకరాల్లో నిర్మిస్తున్న స్మృతివనంలో అమరజీవి 125వ జయంతి వేడుకలను భారీస్థాయిలో నిర్వహించడానికి ఆర్యవైశ్య సంఘాలు, ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. పొట్టి శ్రీరాములు అందరివాడని భావించి.. ప్రతి ఒక్కరూ ఈ విగ్రహావిష్కరణ కోసం కృషి చేశారన్నారు. పొట్టి శ్రీరాములు విగ్రహం కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు ధన్యవాదాలు తెలిపారు. రాజధాని అమరావతి పూర్తయితే ఈ విగ్రహం మరింత అద్భుతంగా కనిపిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన

2లో

## ప్రభుత్వ నిధులతో కాదు
## ఆర్యవైశ్యుల చందాలతో
# అమరజీవి విగ్రహం

**ఎన్టీఆర్ విగ్రహానికి భారీ నిధులు, శ్రీరాములు విగ్రహంపై నిర్లక్ష్యం**

**అమరజీవి త్యాగంతోనే ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది.. వెల్లంపల్లి**



**విజయవాడ (తెలుగోడు), మార్చి 16 :**

అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా విజయవాడ త్రిమూర్తి చౌక్‌లోని ఆయన విగ్రహానికి వైఎస్సార్సీపీ నేతలు ఘనంగా నివాళులర్పించారు. మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు నేతృత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి పూలమాలలు వేసి అమరజీవి త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా

2లో

## కూటమి మోసపూరిత విధానాలను
# ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**వైఎస్సార్సీపీ పరిశీలకుల సమావేశంలో సజ్జల పిలుపు**

**పార్టీ సంస్థాగత బలోపేతంపై కీలక దిశానిర్దేశం**



**తాడేపల్లి (తెలుగోడు), మార్చి 16 :**

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న మోసపూరిత విధానాలను ప్రజలకు వివరించాలని వైఎస్సార్సీపీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం జరిగిన పరిశీలకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిశీలకులు ఈ సమావేశానికి హాజరయ్యారు. పార్టీ కార్యక్రమాలపై సజ్జల రామకృష్ణారెడ్డి, కేంద్ర కార్యాలయ ఇన్చార్జి లేళ్ల అప్పిరెడ్డి

2లో

# 19వ తేదీనే ఉగాది

**మార్చి 19 ఉదయం నుంచే చైత్ర శుద్ధ పాడ్యమి ప్రారంభం..**

**తెలుగు వారి కొత్త సంవత్సరం ఆ రోజే ఆరంభం..**



**అమరావతి (తెలుగోడు), మార్చి 16 :**

తెలుగు ప్రజలు ఎంతో ఆనందంగా, సంప్రదాయబద్ధంగా జరుపుకునే పండుగ ఉగాది. ప్రతి ఏడాది చైత్ర శుక్ల పాడ్యమి రోజునే ఈ పండుగను జరుపుకుంటారు. తెలుగు వారికి కొత్త సంవత్సరానికి ఆరంభమైన ఈ రోజు ప్రత్యేకమైనది. అయితే ఈసారి ఉగాది మార్చి 19న జరుపుకోవాలా లేదా మార్చి 20న జరుపుకోవాలా అనే విషయంలో కొంత అయోమయం నెలకొంది. తిథి గడియల మార్పుల వల్ల రెండు తేదీల మధ్య సందేహం ఏర్పడింది. ఈ నేపథ్యంలో పండితులు దీనిపై స్పష్టత ఇచ్చారు. శాస్త్రప్రకారం ఏ పండుగనైనా సూర్యోదయం సమయంలో ఏ తిథి ఉంటే ఆ రోజునే ఆ పండుగను నిర్వహించాలని పేర్కొంటారు. ఈసారి అమావాస్య తిథి మార్చి 19వ తేదీ తెల్లవారుజామున వరకు కొనసాగుతుంది. అనంతరం ఉదయం 6 గంటల 52 నిమిషాలకు చైత్ర శుద్ధ పాడ్యమి ప్రారంభమవుతుంది. ఈ పాడ్యమి మరుసటి రోజు మార్చి 20వ తేదీ తెల్లవారుజామున 4 గంటల 52 నిమిషాల వరకు కొనసాగుతుంది. దీంతో సూర్యోదయం

(మిగతా 2లో)

## హోర్ముజ్ జలసంధి వద్దకు
# యుద్ధనౌకలు

**ట్రంప్ అభ్యర్థనను తిరస్కరించిన ఆస్ట్రేలియా**

**సంయమనం పాటించాలన్న జపాన్**



**న్యూ ఢిల్లీ (తెలుగోడు), మార్చి 16 :**

హోర్ముజ్ జలసంధిని తెరిపించేందుకు యుద్ధ నౌకలను పంపాలంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన అభ్యర్థనను మిత్ర దేశాలు తిరస్కరించాయి. ప్రస్తుతానికి తమకు ఆ ఆలోచన లేదని తేల్చి చెప్పాయి. ట్రంప్ అభ్యర్థనను ఆస్ట్రేలియా తోసి

(మిగతా 2లో)

## బిజెపి నుంచి రాజ్యసభకు
# మందకృష్ణ



**ఏపీ నుంచి రాజ్యసభకు నాలుగు స్థానాలు ఖాళీ..**

**టిడిపికి రెండు దక్కే అవకాశం.. జనసేన అభ్యర్థిపై పవన్‌దే తుది నిర్ణయం**

**అమరావతి (తెలుగోడు), మార్చి 16 :**

ఆంధ్రప్రదేశ్ నుంచి త్వరలో రాజ్యసభలో నాలుగు స్థానాలు ఖాళీ కానున్న నేపథ్యంలో రాజకీయంగా ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. వచ్చే నెలలో ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుండటంతో మూడు పార్టీల కూటమి ఇప్పటికే ఈ స్థానాలపై అంగీకారానికి వచ్చినట్లు సమాచారం. కూటమిలో ఉన్న మూడు పార్టీలు తమ తమ వాటా ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేసే దిశగా చర్చలు పూర్తి చేసినట్లు తెలుస్తోంది. రాజ్యసభలో ప్రస్తుతం ఉన్న సభ్యుల్లో ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, పరిమల్ నత్వాని పదవీకాలం ముగియనుంది. అదేవిధంగా తెలుగుదేశం పార్టీకి చెందిన సానా సతీష్ పదవీకాలం కూడా ముగియనుంది. వీరిలో సానా సతీష్‌కు మరోసారి అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. దీంతో మిగిలిన మూడు స్థానాలను కూటమిలోని మూడు పార్టీల మధ్య పంచుకునే విధంగా ప్రణాళిక సిద్ధమైంది. ఈ నేపథ్యంలో బీజేపీ తరఫున ఎంఆర్‌పీఎస్ నేత

(మిగతా 2లో)

## భారత్‌కు దక్కనున్న
# భారీ ఊరట

**ముంద్రా పోర్టుకు చేరుకున్న శివాలిక్**

**ఖతార్ నుంచి గ్యాస్‌తో వచ్చిన నౌక**



**ముంద్రా (తెలుగోడు), మార్చి 16 :**

మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ భారత్‌కు ఊరటనిచ్చే వార్త అందింది. ఖతార్ నుండి లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్‌తో బయలుదేరిన భారీ ట్యాంకర్ 'శివాలిక్', సురక్షితంగా గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు చేరుకుంది. హోర్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు పతాక స్థాయిలో ఉన్న సమయంలో ఈ నౌక రాక ప్రాధాన్యత సంతరించుకుంది. ఇరాన్, అమెరికా మధ్య ఘర్షణల కారణంగా ప్రపంచ ఇంధన రవాణాకు కీలకమైన హోర్ముజ్ జలసంధి మూసివేత ముప్పు పొంచి ఉంది. ఇరాన్ ఈ మార్గాన్ని అడ్డుకుంటామని హెచ్చరించిన నేపథ్యంలో, గల్ఫ్ దేశాల నుండి భారత్‌కు చమురు, గ్యాస్ సరఫరా నిలిచిపోతుందేమోనన్న ఆందోళన నెలకొంది. ఇటువంటి క్లిష్ట

(మిగతా 2లో)

## పిఎస్ లకు ఈసీ
# కీలక ఆదేశాలు

**అమల్లోకి ఎన్నికల ప్రవర్తన నియమావళి..**

**ప్రభుత్వ ఆస్తులపై పోస్టర్లు, రాతలు వెంటనే తొలగింపు..**

**అధికార వాహనాలు, వసతుల దుర్వినియోగంపై నిషేధం..**

**ప్రజాధనంతో ప్రకటనల జారీకి ఆంక్షలు..**




**న్యూ ఢిల్లీ (తెలుగోడు), మార్చి 16 :**

ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వెంటనే ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చినట్లు కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. షెడ్యూల్ విడుదలైన మరుసటి రోజే సంబంధిత రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, ప్రధాన ఎన్నికల అధికారులకు ఎన్నికల సంఘం లేఖలు పంపింది. అస్సాం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలతో పాటు ఉప ఎన్నికలు ఎదుర్కొనే ఆరు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, ఎన్నికల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల ప్రవర్తన నియమావళి కేంద్ర ప్రభుత్వానికి కూడా వర్తిస్తుందని ఎన్నికల సంఘం వెల్లడించింది. అన్ని ప్రభుత్వ విభాగాలు ఈ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేసింది. ఎన్నికల సమయంలో ప్రభుత్వ యంత్రాంగం తటస్థంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ప్రజాధన వినియోగం ఎన్నికల ప్రయోజనాల కోసం చేయరాదని సూచించింది. ప్రభుత్వ ఆస్తులు, బహిరంగ ప్రదేశాలు, ప్రైవేటు ఆస్తులపై రాజకీయ పార్టీలు లేదా అభ్యర్థులు రాసిన నినాదాలు, పోస్టర్లు, గోడచిత్రాలను తక్షణమే

(మిగతా 2లో)

## ఆర్డీటి సమస్యను పరిష్కరించేందుకు
# చర్యలు చేబట్టండి

**కేంద్రమంత్రిని కలసిన మంత్రి పయ్యావుల, ఎంపీ అంబికా**



**న్యూ ఢిల్లీ (తెలుగోడు), మార్చి 16 :**

అనంతపురం జిల్లాలో పేదల సంక్షేమం, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషిస్తున్న ఆర్డీటి సంస్థకు ఎదురవుతున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలంటూ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ సోమవారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడును కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్నో దశాబ్దాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆ సంస్థకు ఎదురవుతున్న పరిపాలనా, విధానపరమైన ఇబ్బందులను తొలగించే దిశగా తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. అనంతపురం జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో విద్య, ఆరోగ్యం, మహిళా సాధికారత, పేదల అభ్యున్నతి వంటి రంగాల్లో ఆ సంస్థ అందిస్తున్న సేవలు విశేషమని వారు వివరించారు. వేలాది కుటుంబాలకు ఉపాధి, స్వయం సహాయక కార్యక్రమాలు, పిల్లలకు విద్యా అవకాశాలు కల్పిస్తూ జిల్లాలో సామాజిక అభివృద్ధికి సంస్థ ఎంతో తోడ్పాటు అందిస్తున్నదని చెప్పారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగాలంటే ప్రస్తుతం ఎదురవుతున్న

(మిగతా 2లో)

## ఇరాన్ డ్రోన్
# దాడులు తీవ్రం

**దుబాయ్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో దాడి**

**ఇంధన ట్యాంకర్ వద్ద చెలరేగిన మంటలు**



**టెహ్రాన్ (తెలుగోడు), మార్చి 16 :**

ఇరాన్ తో ఇజ్రాయెల్, అమెరికా యుద్ధంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్, అమెరికా దాడులకు ప్రతీకారంగా ఇరాన్.. డ్రోన్ దాడుల ను తీవ్రతరం చేసింది. తన పొరుగుదేశాల్లోని అమెరికా స్థావరాలే లక్ష్యంగా డ్రోన్‌లతో విరుచుకుపడుతోంది. సోమవారం తెల్లవారుజామున దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో డ్రోన్ దాడులు చేసింది. ఈ సందర్భంగా ఒక డ్రోన్ ఇంధన ట్యాంక్‌ను ఢీకొట్టడంతో భారీగా మంటలు చెలరేగాయి. దాంతో విమానాశ్రయంలోని అన్ని విమానాలను తాత్కాలికంగా నిలిపివేశారు. విమానాశ్రయాన్ని మూసివేసినట్లు దుబాయ్ సివిల్ ఏవియేషన్ అథారిటీ అధికారులు ప్రకటించారు. ప్రయాణికులు, ఎయిర్‌పోర్టు సిబ్బందికి సేఫ్టీ నోటీస్ జారీచేశారు. విమానాల స్టేటస్ తెలుసుకునేందుకు

(మిగతా 2లో)

# త్యాగానికి శాశ్వత స్మారకంగా అమరజీవి విగ్రహం

(మొదటి పేజీ (తరువాయి))



బహిరంగ సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. స్ఫూర్తికి మారు పేరు ఆర్యవైశ్య సంఘమని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ నాయకత్వంలో పొట్టి శ్రీరాములు పనిచేశారని తెలిపారు. అలాగే అనేక సామాజిక ఉద్యమాల్లో ఆయన భాగస్వాములయ్యారని పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ చేసి రాష్ట్రాన్ని సాధించి పెట్టారని చెప్పారు. ఇక రాజధాని అమరావతి నిర్మాణంలో ఎంతోమంది రైతుల త్యాగం ఉందన్నారు. రాజధాని నిర్మాణానికి 29 వేల మంది రైతులు.. 33 వేల ఎకరాల భూమి ఇచ్చారని గుర్తు చేశారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా భారీ ల్యాండ్ పూలింగ్‌కు సహకరించారని వివరించారు. రాజధాని లేని రాష్ట్రంలో వైసీపీ.. మూడు ముక్కలాట ఆడిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతిని గత పాలకులు స్మశానం అని అవహేళన చేశారని తెలిపారు. పొట్టి శ్రీరాములు 58 రోజుల దీక్షకు గుర్తుగా 58 అడుగుల ఆయన భారీ విగ్రహం ఏర్పాటు చేశామన్నారు. 6 నెలల్లో మొదటి దశ పనులు పూర్తి చేశారని వివరించారు. రెండో దశ పనులను కూడా త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఈ విగ్రహం కోసం 26 టన్నుల కాంస్యం, 42 టన్నుల ఐరన్ వినియోగించారని సీఎం చంద్రబాబు చెప్పారు.

గత ప్రభుత్వం పాలనతో బ్రాండ్ దెబ్బతిన్నదని.. తెలుగు జాతి ఇబ్బంది పడిందని గుర్తించి తాను, పవన్ కళ్యాణ్ ఇద్దరం కలసి నిలబడి.. బీజేపీతో కలిసి కూటమిగా జత కట్టామని వివరించారు. గత ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును విధ్వంసం చేసిందన్నారు. 2027 గోదావరి పుష్కరాలకంటే ముందు పోలవరాన్ని జాతికి అంకితం చేస్తామని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. అమరావతిని మూడు ఏళ్లలో ఒక స్థాయికి తీసుకు వస్తామని స్పష్టం చేశారు. అమరావతిలో ఖర్చు ప్రభుత్వం డబ్బు కాదని.. ఇది ల్యాండ్ మానిటైజేషన్ ప్రాజెక్ట్ అని ఏపీ సీఎం వివరించారు. అమరావతి వల్ల సంక్షేమం సక్రమంగా జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. మొన్నటి వరకూ ఆర్య వైశ్యులు వ్యాపారాలు చేసుకోవాలన్నా భయపడుతూ చేసుకోవాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. రూ. 10 సంపాదిస్తే అందులో రూ.2 దానం చేసేది ఆర్య వైశ్య కులమని తెలిపారు. ఆర్య వైశ్యులను అనేక విధాలుగా పిలుస్తారని.. అందరిని అదే పేరుతో పిలిచేలా త్వరలోనే జీవో జారీ చేస్తామని ప్రకటించారు. పొట్టి శ్రీరాములకు నిజమైన నివాళి ఇవ్వడమంటే.. ఏపీని నెంబర్ వన్‌గా నిలపడమేనని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## తెలుగు జాతి కోసం ప్రాణ త్యాగం ..

### నివాళి అర్పించిన డిప్యూటీ సిఎం పవన్..

తెలుగు జాతి కోసం పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేశారని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. మద్రాస్ ప్రెసిడెన్సీలో తెలుగు ప్రజల ఇబ్బందులను ఆయన గుర్తించి.. ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడారని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళిగా 58 అడుగుల భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆయన 125వ జయంతి సందర్భంగా అమరావతిలోని శాఖమూరులో ఈ విగ్రహాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ



కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్ సహా పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం నాయకులు అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్.. పొట్టి శ్రీరాములు మన గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోయే మహానుభావుడని అన్నారు. స్వాతంత్ర్య సమర కాలంలో మహాత్మా గాంధీ 'నా వెంట 11 మంది ఉంటే దేశానికి స్వాతంత్ర్యం తీసుకురాగలను' అన్న మాటలను గుర్తుచేశారు. అలాంటి మహనీయుల త్యాగాల వల్లే మనకు స్వేచ్ఛ లభించిందని ఆయన తెలిపారు. తాను పొట్టి శ్రీరాములు గారిని ప్రత్యక్షంగా కలిసే అవకాశం పొందలేదని, అయితే వారి కుటుంబ సభ్యులను చూడటం ద్వారా వారి త్యాగాలను గుర్తు చేసుకునే అవకాశం లభించిందని పవన్ కళ్యాణ్ అన్నారు. అమరావతి నడిబొడ్డున పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేసినందుకు సీఎం కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈకార్యక్రమం నిర్వహణలో కీలకంగా వ్యవహరించిన మంత్రి లోకేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## ఒక మనిషి త్యాగం ..ఒక జాతి గౌరవం

### నివాళి అర్పించిన మంత్రి లోకేశ్

అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా అమరావతి లోని శాఖమూరులో 58 అడుగుల ఎత్తైన భారీ విగ్రహాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి లోకేశ్ పాల్గొని ప్రసంగించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను 'ఉస్తాద్ భగత్ సింగ్' అని మంత్రి సంబోధించారు. 'ఒక మనిషి త్యాగం ఒక జాతి గౌరవం. ఒక మనిషి మరణం ఒక రాష్ట్రం' అని అమరజీవి త్యాగాన్ని స్మరించుకున్నారు. 'అమరజీవి... చిరంజీవి' అని పేర్కొన్నారు. ఈ విగ్రహానికి 'ఏపీ ఆత్మగౌరవం స్టాట్యూ ఆఫ్ సాక్రిఫైస్' అనే పేరు పెట్టాలని కోరినట్లు లోకేశ్ తెలిపారు. యువగళం పాదయాత్రలో ఆర్యవైశ్య సోదరులను కలసి హామీ ఇచ్చానని.. 'అమరావతిలోనే పొట్టి శ్రీరాములు విగ్రహం పెడతామని చెప్పి.. చేసి చూపించాం' అని మంత్రి గుర్తుచేశారు. ఒక రోజు ఉపవాసం చేయాలంటే ఇబ్బంది పడతామని... కానీ తెలుగు ప్రజల కోసం, జాతి కోసం పొట్టి శ్రీరాములు దీక్ష చేశారన్నారు. ఈ చరిత్రను భావితరాలు గుర్తుపెట్టుకునే విధంగా ఇక్కడ విగ్రహం ఏర్పాటు చేశామని వెల్లడించారు. అనుకున్న సమయానికి విగ్రహం సిద్ధం చేశామని మంత్రి తెలిపారు. ఆర్యవైశ్య సోదరులను ఆదర్శంగా తీసుకోవాలని సీఎం క్యాబినెట్‌లో చెప్పానని లోకేశ్ పేర్కొన్నారు. దళితులకు ఆలయ ప్రవేశం కోసం అమరజీవి కృషి చేశారని తెలిపారు. ఆయన స్ఫూర్తితోనే యువగళం పాదయాత్ర చేశానని చెప్పుకొచ్చారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం మొదటి అడుగు ఆయనే వేశారన్నారు. పొట్టి శ్రీరాములు పేరుతో ఒక కాయిన్ రిలీజ్ చేయాలని కోరానని.. కేంద్రంతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

# ఆర్యవైశ్యుల చందాలతో అమరజీవి విగ్రహం

(మొదటి పేజీ (తరువాయి))

వెలంపల్లి మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటుకు కారణమైన మహనీయుడైన పొట్టి శ్రీరాములు విగ్రహానికి కూడా ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదని తీవ్రంగా ప్రశ్నించారు.ఆర్యవైశ్యుల చందాలతోనే పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఆయన పేర్కొన్నారు. విగ్రహ నిర్మాణానికి ఒక అంగుళానికి ఐదు వేల రూపాయల చొప్పున ప్రజల నుంచి వసూలు చేశారని చెప్పారు. కానీ మరోవైపు 158 అడుగుల ఎన్టీఆర్ విగ్రహ నిర్మాణానికి మాత్రం సుమారు 1700 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. పొట్టి శ్రీరాములు వంటి మహనీయుడి విగ్రహానికి మాత్రం ప్రభుత్వం ఎందుకు నిధులు ఇవ్వలేదని ఆయన ప్రశ్నించారు.పొట్టి శ్రీరాములు రాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి తన ప్రాణాలను అర్పించారని వెలంపల్లి గుర్తు చేశారు. ఆయన త్యాగ ఫలితంగానే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని పేర్కొన్నారు. అలాంటి మహనీయుడి సేవలను గుర్తించి గౌరవించిన పార్టీ వైఎస్సార్సీపీ మాత్రమేనని చెప్పారు. నెల్లూరు జిల్లాకు పొట్టి శ్రీరాములు పేరు పెట్టిన ఘనత తమ ప్రభుత్వానిదేనని తెలిపారు.వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ వేడుకలను మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించామని, పొట్టి శ్రీరాములు కుటుంబ సభ్యులను సన్మానించామని ఆయన వివరించారు. అయితే నాలుగోసారి ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు నాయుడు తన పదవీకాలంలో ఒక్కసారి కూడా పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు లేదా ఆంధ్ర రాష్ట్ర అవతరణ వేడుకలు నిర్వహించలేదని విమర్శించారు.పొట్టి శ్రీరాములను అవమానించిన వ్యక్తి చంద్రబాబు నాయుడేనని వెలంపల్లి ఆరోపించారు. ఆయన జ్ఞాపకాలను ప్రజల మనసుల నుంచి చెరిపేయాలని కుట్ర జరుగుతోందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన వెంటనే మొదటి ఏడాదే ఆంధ్ర రాష్ట్ర అవతరణ వేడుకలను ఘనంగా నిర్వహించారని ఆయన గుర్తు చేశారు.

# ఆర్డీటీ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేబట్టండి

(మొదటి పేజీ (తరువాయి))

సమస్యలను త్వరగా పరిష్కరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.జిల్లాలో అత్యంత వెనుకబడిన ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు సంస్థ అందిస్తున్న సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని, పేదల జీవితాల్లో మార్పు తీసుకువచ్చే విధంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నదని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల అభివృద్ధి, వ్యవసాయానికి సాంకేతిక సహాయం, మహిళలకు ఉపాధి అవకాశాలు, వికలాంగులకు సహాయక కార్యక్రమాలు వంటి పలు రంగాల్లో సంస్థ చేస్తున్న సేవలను కేంద్ర మంత్రికి వివరించారు.ఈ నేపథ్యంలో సంస్థపై ఉన్న సమస్యలను తొలగించేలా సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన మార్గదర్శకాలు జారీ చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. అవసరమైతే ఈ విషయాన్ని దేశ ప్రధాని, కేంద్ర హోం శాఖ మంత్రుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.అనంతపురం జిల్లా అభివృద్ధిలో ఆ సంస్థ పాత్ర ఎంతో గొప్పదని, పేదల కోసం అంకితభావంతో పనిచేస్తున్న ఈ సేవా సంస్థ కొనసాగడం జిల్లాకు ఎంతో అవసరమని వారు అభిప్రాయపడ్డారు. పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే సంస్థలను ప్రోత్సహించడం ప్రభుత్వాల బాధ్యతగా భావిస్తున్నామని, అందుకే సమస్యల పరిష్కారానికి అన్ని స్థాయిల్లో ప్రయత్నాలు



కొనసాగిస్తున్నామని చెప్పారు.జిల్లాలో ఎన్నో సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలతో గుర్తింపు పొందిన ఆ సంస్థను ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ స్పష్టం చేశారు. ప్రజలకు అందుతున్న సేవలు ఎటువంటి అంతరాయం లేకుండా కొనసాగేందుకు అవసరమైన చర్యలు తీసుకునేలా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడును కోరినట్లు తెలిపారు.



# కూటమి మోసపూరిత విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

(మొదటి పేజీ (తరువాయి))

తదితరులు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్సీపీ 15 సంవత్సరాలు పూర్తి చేసుకుని 16వ ఆవిర్భావ దినోత్సవంలోకి అడుగుపెట్టిందన్నారు. ప్రజలతో కలిసి ప్రజల కోసమే పనిచేస్తూ పార్టీ ముందుకు సాగుతోందని తెలిపారు. వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వెంట నడిచే ప్రతి కార్యకర్త గర్వంగా చెప్పుకునే స్థాయిలో పార్టీ ఎదిగిందన్నారు. ప్రజల్లో వైఎస్సార్సీపీపై విశ్వాసం రోజురోజుకూ మరింత పెరుగుతోందని పేర్కొన్నారు.పార్టీ భవిష్యత్ విజయానికి సంస్థాగత బలోపేతం అత్యంత అవసరమని సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని స్థాయిల్లో కమిటీలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. నియోజకవర్గ ఇన్చార్జులకు పరిశీలకులు సహాయక వ్యవస్థగా పనిచేస్తూ పార్టీ కార్యకలాపాలను సమర్థంగా ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు.వైఎస్సార్సీపీ ప్రభుత్వ కాలంలో అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు గుర్తు చేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. ఆ కార్యక్రమాల ప్రయోజనాలను ఇంటింటికీ తీసుకెళ్లి ప్రజలకు వివరించాలని సూచించారు. అదే సమయంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం చేపడుతున్న విధానాల వల్ల ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను కూడా స్పష్టంగా తెలియజేయాలని అన్నారు.తప్పుడు ప్రచారం, దుష్ప్రచారాలను వాస్తవాలతో ఎదుర్కోవాలని సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను సహించబోమన్నారు. ఎన్నికల్లో విజయానికి బూత్ స్థాయి నిర్మాణం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రతి బూత్‌లో పార్టీ బలంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటర్ల వివరాలను సక్రమంగా పరిశీలిస్తూ ఎలాంటి లోపాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పార్టీ పటిష్టతతో పాటు ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా అందరూ సమిష్టిగా పనిచేయాలని సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు.

# అన్ని రాష్ట్రాల్లోనూ గ్యాస్ నిల్వలు

## వంట గ్యాస్ సరఫరాపై కేంద్రం కీలక ప్రకటన



**న్యూ ఢిల్లీ (తెలుగోడు), మార్చి 16 :** వంట గ్యాస్ సరఫరాపై కేంద్రం కీలక ప్రకటన చేసింది. గృహ వినియోగదారులకు వంద శాతం ఎల్పీజీ సరఫరా చేస్తామని కేంద్రం స్పష్టం చేసింది. అన్ని రాష్ట్రాల్లో ఎల్పీజీ స్టాక్ ఉందని తెలిపింది. హర్మూజ్ దగ్గర భారత నౌకలన్నీ క్షేమంగానే ఉన్నాయని, శివాలిక్ నౌకలో 48 వేల మెట్రిక్ టన్నుల గ్యాస్ ఉందని కేంద్రం వెల్లడించింది. కాగా, ఖతార్ నుండి లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్‌తో బయలుదేరిన 'శివాలిక్' నౌక సురక్షితంగా గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు చేరుకుంది. హోర్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు పతాక స్థాయిలో ఉన్న సమయంలో ఈ నౌక రాక ప్రాధాన్యత సంతరించుకుంది.కేంద్రం కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరాను పూర్తిగా నిలిపి వేసింది. దీంతో దేశ వ్యాప్తంగా ఉన్న హోటళ్లు, రెస్టారెంట్లు మెల్లమెల్లగా మూతపడుతున్నాయి. హాస్టల్స్ మెనూను పూర్తిగా మార్చేశాయి. కేవలం ఒక కర్రీతో సరిపెడుతున్నాయి. గ్యాస్ కొరత కారణంగా పలు దేవాలయాలు తాత్కాలికంగా ప్రసాదం తయారీని నిలిపివేశాయి. సీఎన్‌జీ బంకుల్లోనూ గ్యాస్ నిల్వలు అడుగంటుతున్నాయి. దీని కారణంగా గ్యాస్‌తో నడిచే వందలాది ఆటోలు నిలిచిపోతున్నాయి. డొమస్టిక్ గ్యాస్ సిలిండర్ల వినియోగదారులకు కూడా కష్టాలు తప్పటం లేదు. బుకింగ్, డెలివరీ విషయంలో నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గ్యాస్ సిలిండర్ కోసం వినియోగదారులు గంటల తరబడి క్యూలో వేచి ఉంటున్నారు. యుద్ధ పరిస్థితులకు తోడు.. పండుగ సమయం కావటంతో గ్యాస్ సిలిండర్లకు ఎక్కువ డిమాండ్ ఏర్పడింది. మండుటెండను సైతం లెక్క చేయకుండా జనం గంటల తరబడి క్యూ లైన్‌లో నిలబడి సిలిండర్ తీసుకుంటున్నారు.

# సిఎస్ లకు ఈసీ కీలక ఆదేశాలు

(మొదటి పేజీ (తరువాయి))

తొలగించాలని ఆదేశించింది. ఎన్నికల సమయంలో ప్రభుత్వ వాహనాలు, అధికారిక వసతుల వినియోగం రాజకీయ ప్రయోజనాల కోసం చేయరాదని స్పష్టం చేసింది. ప్రజాధనంతో ప్రకటనల జారీపై ఎన్నికల సంఘం నిషేధం విధించింది.ప్రజల గోప్యతకు భంగం కలిగించే చర్యలు చేపట్టరాదని ఎన్నికల సంఘం హెచ్చరించింది. ప్రైవేటు నివాసాల వెలుపల నిరసనలు, ధర్నాల నిర్వహణకు అనుమతి లేదని తెలిపింది. యజమాని అనుమతి లేకుండా ఇతరుల భూమి, భవనాలు, గోడలను జెండాలు, బ్యానర్లు, పోస్టర్ల కోసం వినియోగం చేయరాదని స్పష్టం చేసింది.ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పర్యవేక్షణ కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. ప్రజలు కాల్ సెంటర్ 1950 ద్వారా లేదా సీవిజిల్ యాప్ సహాయంతో నేరుగా సంబంధిత జిల్లా ఎన్నికల అధికారులకు ఫిర్యాదులు పంపవచ్చని తెలిపింది. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, స్వేచ్ఛాయుతంగా సాగేందుకు అవసరమైన చర్యలు చేపడతామని ఎన్నికల సంఘం పేర్కొంది. నాలుగు రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల తేదీలను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 9వ తేదీన కేరళలో పోలింగ్ నిర్వహణ జరుగనుంది. అదే నెల 23వ తేదీన తమిళనాడు అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల ప్రక్రియ ఒకే దశలో పూర్తవుతుందని ఎన్నికల సంఘం వెల్లడించింది. మే 4వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు తెలిపింది. ఈ ఎన్నికలలో పశ్చిమ బెంగాల్, అస్సాం రాష్ట్రాలు కూడా ఉన్నాయి. పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంత అసెంబ్లీకి కూడా పోలింగ్ నిర్వహించనున్నారు.





# హోర్ముజ్ జల సంధి వద్దకు యుద్ధనౌకలు

(మొదటి పేజీ (తరువాయి))

తోసి పుచ్చింది. తాము యుద్ధ నౌకలను పంపబోమని స్పష్టం చేసింది. 'ఆ జలసంధి ఎంత కీలకమో మాకు తెలుసు. కానీ అక్కడకు మేము యుద్ధ నౌకలను పంపబోము. అసలు యుద్ధ నౌకల కోసం మమ్మల్ని ఎవరూ సంప్రదించలేదు. మేము ఈ విషయంలో జోక్యం చేసుకోలేదు' అని ఆస్ట్రేలియా కేబినెట్ మంత్రి కేథరిన్ కింగ్ చెప్పారు. ట్రంప్ అభ్యర్థనపై జపాన్ ఆచితూచి స్పందించింది. ఈ విషయంలో సంయమనం అవసరమని పేర్కొంది. ప్రస్తుత పరిస్థితుల్లో తాము మేరిటైమ్ చర్యల గురించి ఆలోచించట్లేదని పేర్కొంది. ఇతర ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించినట్లు తెలిపింది. అమెరికాతో మరిన్ని చర్చల తరువాత ఈ విషయంలో ఒక నిర్ణయానికి వస్తామని దక్షిణ కొరియా పేర్కొంది. సమగ్ర సమీక్ష తరువాత ఈ విషయంలో ముందడుగు వేస్తామని వెల్లడించింది. బ్రిటన్ కూడా ఈ విషయమై ఆచితూచి స్పందించింది. యుద్ధ నౌకలను పంపించే విషయంలో ట్రంప్‌తో చర్చిస్తున్నామని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ పేర్కొన్నారు. కెనడా ప్రధాని మార్క్ కార్నీతో కూడా చర్చించినట్లు తెలిపారు. సోమవారం జరగనున్న సమావేశంలో మరోసారి ఈ విషయమై చర్చిస్తామని అన్నారు.హోర్ముజ్ జలసంధిని తెరిపించేందుకు యుద్ధ నౌకలను పంపించాలని పలు దేశాలను అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదివారం అభ్యర్థించిన విషయం తెలిసిందే. తమ పరిధిలోని ప్రాంతాన్ని ఆయా దేశాలు రక్షించుకోవాలని అన్నారు. ఇంధన అవసరాల కోసం హోర్ముజ్ జలసంధిపై అమెరికా అంతగా ఆధారపడలేదని అన్నారు. ఇతర దేశాలకే ఆ అవసరం ఎక్కువని కామెంట్ చేశారు. ఈ సందర్భంగా చైనా గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. చైనా దిగుమతుల్లో అధిక శాతం హోర్ముజ్ మీదుగానే వెళుతున్నాయని అన్నారు. అయితే, హోర్ముజ్ జలసంధిని తెరిపించే ప్రయత్నాల్లో చైనా భాగం అవుతుందా? లేదా? అనే విషయంపై ఆయన స్పందించేందుకు నిరాకరించారు.

# భారత్‌కు దక్కనున్న భారీ ఊరట

(మొదటి పేజీ (తరువాయి))

పరిస్థితుల్లో 'శివాలిక్' నౌక సురక్షితంగా ప్రయాణించి లక్ష్యాన్ని చేరుకోవడం భారత ఇంధన భద్రతకు సానుకూల సంకేతంగా నిపుణులు భావిస్తున్నారు. శివాలిక్ ఎల్‌పిజి ట్యాంకర్ ఖతార్‌లోని రాస్ లఫ్ఫాన్ నుండి వేల టన్నుల ఎల్‌పీజీని మోసుకొచ్చింది. ఉద్రిక్తతల దృష్ట్యా భారత నావికాదళం గల్ఫ్ ప్రాంతంలో నిఘాను పెంచిన సంగతి తెలిసిందే. భారతీయ నౌకల ప్రయాణాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ భద్రతాపరమైన భరోసా కల్పిస్తోంది. గుజరాత్‌లోని అదానీ ముంద్రా పోర్టులో ఈ గ్యాస్ అన్-లోడింగ్ పక్రియ ప్రారంభమైంది. ఇది దేశీయ గ్యాస్ అవసరాలకు ఎంతో కీలకం. ప్రపంచవ్యాప్తంగా రవాణా అయ్యే చమురులో సుమారు 20 శాతం ఈ జలసంధి ద్వారానే సాగుతుంది. ఇరాన్-అమెరికా యుద్ధం వల్ల ఈ మార్గం మూసుకుపోతే అంతర్జాతీయంగా చమురు ధరలు ఆకాశాన్ని తాకే ప్రమాదం ఉంది. ఇప్పటికే పలు అంతర్జాతీయ షిప్పింగ్ కంపెనీలు ఈ మార్గంలో ప్రయాణాన్ని నిలిపివేయగా, భారత్ మాత్రం తన వ్యూహాత్మక సంబంధాల ద్వారా సరఫరాను కొనసాగిస్తోంది.

# ఇరాన్ డ్రోన్ దాడులు తీవ్రం

(మొదటి పేజీ (తరువాయి))

విమానయాన సంస్థలను సంప్రదించాలని ప్రయాణికులకు సూచనచేశారు. అంతేగాక పలు విమానాలను అల్ మక్తూమ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మళ్లించినట్లు ఎయిర్‌పోర్ట్ అధికారులు తెలిపారు. ఇంధన ట్యాంక్‌కు అంటుకున్న మంటలను ఆర్పేందుకు దుబాయ్ సివిల్ డిఫెన్స్ సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. సమీపంలోని ప్రజలు ఇళ్లల్లోనే ఉండాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇంధన ట్యాంక్‌పై దాడి నేపథ్యంలో ఈ ప్రాంతంలోని కీలకమైన ఇతర మౌలిక సదుపాయాల వద్ద భద్రత పెంచినట్లు అధికారులు పేర్కొన్నారు.

# 19వ తేదీనే ఉగాది

(మొదటి పేజీ (తరువాయి))

సమయానికి పాడ్యమి తిథి ఉండటంతో మార్చి 19నే ఉగాది పండుగగా జరుపుకోవాలని పండితులు స్పష్టత ఇచ్చారు. అందువల్ల ఈ ఏడాది తెలుగు నూతన సంవత్సరం ప్రారంభం మార్చి 19 నుంచే అవుతుంది. ఆ రోజున ఇంటింటా మామిడి తోరణాలు కట్టి, ఉగాది పచ్చడి తయారు చేసి పండుగను ఘనంగా జరుపుకుంటారు. పంచాంగ శ్రవణం కూడా ఉగాది రోజున ముఖ్యమైన ఆచారంగా భావిస్తారు.ఉగాది పండుగ అనంతరం వెంటనే రంజాన్ పండుగ రావడం వల్ల రెండు రోజుల వరుస సెలవులు లభిస్తున్నాయి. మార్చి 19న ఉగాది సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. అలాగే మార్చి 20న రంజాన్ పండుగ సందర్భంగా కూడా సెలవు ఇవ్వాలని ప్రభుత్వాలు నిర్ణయించాయి. అయితే నెలవంక దర్శనంలో మార్పులు వస్తే రంజాన్ తేదీలో మార్పు ఉండే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.ఇక వరుసగా వచ్చే వారాంతపు సెలవులు కూడా ఉండటంతో మార్చి నెలలో కొన్ని రోజుల పాటు విరామం ఏర్పడనుంది. ఈ నెలలో పాఠశాలలకు ఇప్పటికే ఒంటిపూట బడులు ప్రారంభమయ్యాయి. పండుగల వాతావరణంతో తెలుగు రాష్ట్రాల్లో ఉగాది వేడుకలకు ఏర్పాట్లు కూడా ప్రారంభమయ్యాయి. ఇంటింటా కొత్త సంవత్సరాన్ని స్వాగతించేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు.

# బిజెపి నుంచి రాజ్యసభకు మంద క్రిష్ణ

(మొదటి పేజీ (తరువాయి))



మందకృష్ణ మాదిగ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. సామాజిక సమీకరణలు, దళిత వర్గాలకు ప్రాధాన్యం కల్పించాలనే ఆలోచనతో ఆయనకు ఈసారి అవకాశం ఇవ్వాలని పార్టీ నాయకత్వం భావిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. దీర్ఘకాలంగా దళిత హక్కుల కోసం పోరాటం చేస్తున్న నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉండటంతో రాజ్యసభకు పంపే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది.తెలుగుదేశం పార్టీకి ఈసారి రెండు స్థానాలు దక్కే అవకాశం ఉంది. అందులో ఒకటి సానా సతీష్‌కు రెన్యువల్ కానుండగా, మరో సీటు కోసం పలువురు నేతలు పోటీలో ఉన్నారు. ముఖ్యంగా ఎస్సీ లేదా బీసీ వర్గాలకు చెందిన నాయకుడికి ఈ సీటు ఇవ్వాలని పార్టీ లోపల చర్చ జరుగుతోంది. పొలిట్ బ్యూరోలో ఉన్న ఇద్దరు సీనియర్ నేతల పేర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. అదే సమయంలో ఒక ప్రముఖ ఔషధ సంస్థ అధినేత పేరు కూడా రేసులో ఉందని ప్రచారం జరుగుతోంది.ప్రాంతీయ సమీకరణలు, సామాజిక సమతుల్యత, రాజకీయ అవసరాలను దృష్టిలో పెట్టుకుని తెలుగుదేశం పార్టీ రెండో అభ్యర్థి విషయంలో తుది నిర్ణయం తీసుకోనుంది. మరోవైపు జనసేన నుంచి ఎవరు రాజ్యసభకు వెళ్తారనే అంశంపై కూడా ఆసక్తి నెలకొంది. జనసేన అధినేత ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం ఉన్నప్పటికీ ఆ పేరు అనూహ్యంగా ఉండొచ్చని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. దీంతో వచ్చే రోజుల్లో అధికారిక ప్రకటన కోసం రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.


# అమరజీవి పొట్టి శ్రీరాములకు ఘన నివాళులు

## ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి..

**తాడిపత్రి (తెలుగోడు), మార్చి 16 :**
అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతిని పునస్కరించుకొని పట్టణంలోని గాంధీ సర్కిల్‌లోనున్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి తాడిపత్రి శాసనసభ్యులు జేసీ అస్మిత్ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగఫలమే నేటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆవిర్భావానికి కారణమని తెలిపారు. తెలుగు జాతి ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన నిరాహార దీక్ష, ప్రాణత్యాగాన్ని ప్రతి తెలుగువాడు గుర్తుంచు కోవాలన్నారు. పొట్టి శ్రీరాములు జీవితం తెలుగు వారందరికి స్ఫూర్తిదాయకమని అన్నారు. త్యాగమూర్తి పొట్టి శ్రీరాములను ఎల్లప్పుడూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే జేసీ అష్మిత్ రెడ్డి ప్రారంభించి, అన్నదానం చేపట్టారు. కోర్టు సమీపంలోని సీబీ రోడ్డులో పెన్షనర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.


అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి


పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి


పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

# ఘనంగా పొట్టి శ్రీరాములు 125వ జయంతి

**అనంతపురం కల్చరల్ (తెలుగోడు), మార్చి 16 :**
స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆళ్లగడ్డ రాము మాట్లాడుతూ ప్రత్యేక తెలుగు రాష్ట్రాన్ని సాధించిన ఘనత మన పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఈ సందర్భంగా శ్రీవారి సేవకులు పొట్టి శ్రీరాములు విగ్రహానికి పుష్పమాలను పూలలు సమర్పించి జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ రాముతో పాటు శ్రీవారి సేవకులు శివ అనిల్ ప్రసాద్ సురేష్ అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.


తహసిల్దార్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న అధికారులు

# అమరజీవి పొట్టి శ్రీరాములకు ఘన నివాళులు

**బెళగుప్ప (తెలుగోడు), మార్చి 16 :**
అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతిని పునస్కరించుకొని సోమవారం తహసిల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో పాటు, ఇతర అధికారులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో లక్ష్మీనారాయణ, రీ సర్వే డిప్యూటీ తహసిల్దార్ గురుబ్రహ్మ మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగఫలమే నేటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆవిర్భావానికి కారణమని తెలిపారు. తెలుగు జాతి ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన నిరాహార దీక్ష, ప్రాణత్యాగాన్ని ప్రతి తెలుగువారు గుర్తుంచుకోవాలన్నారు. పొట్టి శ్రీరాములు జీవితం తెలుగు వారందరికి స్ఫూర్తిదాయకమని అన్నారు. త్యాగమూర్తి పొట్టి శ్రీరాములను ఎల్లప్పుడూ స్మరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీనారాయణ,రి సర్వే డిప్యూటీ తహసిల్దార్ గురుబ్రహ్మ, మండల వ్యవసాయాధికారి పృథ్వి సాగర్, హౌసింగ్ ఏఈ గోపీచంద్ నాయక్, ఏపీవో మురళి, వీఆర్వోలు రమేష్, ఈశ్వర్ రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


బెళుగుప్ప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న అధికారులు

# సజావుగా 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు

*తెలుగు పరీక్షకు 9 మంది గైర్హాజరు...*

**బెళగుప్ప (తెలుగోడు), మార్చి 16 :**
బెళుగుప్పలో సోమవారం నుంచి ప్రారంభమైన 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు మొదటి రోజు సజావుగా జరిగాయి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో 220 మంది విద్యార్థులు, శ్రీనివాస విద్యానికేతన్ లో 218 మంది విద్యార్థులు వివిధ పాఠశాలల నుంచి పదవ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా మొదటిరోజు సోమవారం తెలుగు పరీక్షకు 9 మంది గైర్హాజరయ్యారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పరీక్ష ప్రారంభ సమయానికి ముందే చేరుకొని పరీక్షా కేంద్రాల వద్ద హడావుడి జరిగింది. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకుని వచ్చి పరీక్షా కేంద్రాలలో వదిలారు. ఎట్టకేలకు తెలుగు పరీక్ష ప్రశాంతంగా సజావుగా జరిగింది. పరీక్ష కేంద్రాల వద్ద ఎస్ఐ శివ తన సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

# పుకార్లు నమ్మవద్దు గ్యాస్ సరఫరా యథాతథం..

**కనేకల్ (తెలుగోడు), మార్చి 16 :**
గ్యాస్ సిలిండర్ల విషయంలో పుకార్లను నమ్మవద్దని పట్టణంలోని సుధీర్ సాయి ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ యాజమాన్యం తెలిపారు. ప్రజలకు సరైన సమయంలో గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఇటీవల కొంతమంది తప్పుడు ప్రచారం చేయడంతో కనేకల్ ప్రాంతంలో గ్యాస్ సరఫరా నిలిచిపోయిందని ప్రజల్లో అనుమానాలు ఏర్పడ్డాయని వారు పేర్కొన్నారు. ఈ విషయంపై పోలీసులు కూడా స్పందిస్తూ ప్రజల్లో ఎలాంటి అపోహలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని, గ్యాస్ సరఫరా నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. గ్యాస్ పంపిణీ విషయంలో ఎటువంటి సమస్య లేదని వారు తెలిపారు. ఈ విషయంపై గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులను అడగగా, ప్రజల్లో గ్యాస్ దొరకదనే పుకార్లు వ్యాపించడం వల్ల ఒక్కసారిగా ఎక్కువ మంది బుకింగ్ చేసుకోవడానికి ప్రయత్నించారని తెలిపారు. దీంతో కార్యాలయం వద్ద ఒకేసారి ఎక్కువ మంది రావడం వల్ల కొంత ఇబ్బంది ఏర్పడిందని చెప్పారు. అయితే గ్యాస్ సరఫరా నిలిపివేయలేదని, బుకింగ్ చేసిన ప్రతి వినియోగదారునికి సాధారణంగా వారి ఇంటి వద్దకే గ్యాస్ సిలిండర్లు డెలివరీ చేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రజలు పుకార్లను నమ్మకుండా గ్యాస్ ఏజెన్సీకి సహకరించాలని సుధీర్ సాయి ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



కనేకల్‌లోని సుధీర్ సాయి ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ

# యర్రగుడిలో సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

## పయ్యావుల సోదరుల సహకారంతో అభివృద్ధి..

**బెళగుప్ప (తెలుగోడు), మార్చి 16 :**
బెళుగుప్ప మండలం పరిధిలోని యర్రగుడి గ్రామంలో సుమారు 24 లక్షల రూపాయల నిధులతో బీసీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి టీడీపీ నాయకులు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ రాస్ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, సోదరులు టిడిపి జిల్లా నేత బయ్యావుల శ్రీనివాసుల సహకారంతో యర్రగుడి గ్రామంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. పయ్యావుల సోదరుల సహకారంతో మండలంలోని వివిధ గ్రామాలలో లక్షలాది రూపాయలతో భారీ ఎత్తున సిసి రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. అనంతరం సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజతో ప్రత్యేక పూజలు నిర్వహించి, పనులను ప్రారంభించారు ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ వెంకటాద్రి పల్లి సునీల్, దబ్బర లక్ష్మీనారాయణ, బాలాజీ, ఎర్రిస్వామి, చిరంజీవి, కోదండ, శివరామకృష్ణ, ప్రభాకర్, శ్రవ్య స్రవంతి, రాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


యర్రగిడిలో సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న టీడీపీ నాయకులు

# మాజీ సర్పంచ్ పైనేటి తిమ్మప్పకు అభినందనలు

## మండల వైఎస్ఆర్సిపి నాయకులు ..

**కనేకల్ (తెలుగోడు), మార్చి 16 :**
మండల పరిధిలోని హనుమాపురం గ్రామానికి సంబంధించిన మాజీ సర్పంచ్ వైఎస్ఆర్సిపి నాయకుడు, మాజీ రూరల్ బ్యాంక్ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్ప చౌదరిని మండల వైఎస్సార్ సీపీ పార్టీ నాయకులు సోమవారంలో కలిసి అభినందనలు తెలిపారు. వైయస్సార్ సిపి పార్టీ రాయ దుర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి తిమ్మప్ప సేవలను గుర్తించి పార్టీ అతనికి పంచాయతీ రాజ్ విభాగం జాయింట్ సెక్రటరీగా నియమించడంతో పార్టీ నాయకులు వెళ్లి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తిమ్మప్ప చౌదరి మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి రాష్ట్రస్థాయి నందు పంచాయతీరాజ్ విభాగం జాయింట్ సెక్రెటరీగా నియమించడం సంతోషాన్నిచ్చిందని దానికి తగ్గట్టుగా నా వంతు కృషిచేసి పార్టీ బలోపేతానికి తోడ్పడతాన్నారు. పార్టీ అధికారంలోకి రావడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా మెట్టు గోవిందరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ,రాష్ట్ర రైతు విభాగం జాయింట్ సెక్రటరీ ఆలేరు రాజగోపాల్ రెడ్డి, కనేకల్ మండలం కన్వీనర్ పాటిల్ బ్రహ్మానంద రెడ్డి, వైఎస్ఆర్సిపి పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మారెంపల్లి మారెన్న,బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి హల్లి నాగరాజు, పంచాయతీరాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆది సద్గురు చంద్రశేఖర్ రెడ్డి హనుమాపురం గ్రామస్తులు వైఎస్ఆర్సిపి నాయకులు అభినందనలు తదితరులు పాల్గొన్నారు.


హనుమాపురం పైనేటి తిమ్మప్పను అభినందిస్తున్న మండల వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు

# విద్యార్థులకు నీడనిచ్చిన వైకాపా కార్యాలయం!

**యాడికి (తెలుగోడు), మార్చి 16 :**
యాడికి మండల కేంద్రంలోని ప్యారడైజ్ పాఠశాల సమీపంలో పాఠశాల విద్యార్థులకు వైసిపి పార్టీ కార్యాలయమే నీడనిస్తోంది.. సోమవారం నుండి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కావడంతో మధ్యాహ్నం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు ఎండ విపరీతంగా ఉండడంతో సమీపంలోని వైసిపి కార్యాలయం ఆవరణ నీడలో కూర్చున్నారు.


వైకాపా కార్యాలయం నీడలో కూర్చున్న విద్యార్థులు

# నిరుపేదలకు నిత్యావసరాల కిట్లు, చీరలు పంపిణీ

## నూర్ బాషా దూదేకుల సేవా సంఘం గౌరవాధ్యక్షులు నేతాజీ దస్తగిరి ..

**తాడిపత్రి (తెలుగోడు), మార్చి 16 :**
పవిత్ర రంజాన్ మాసంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో పుణ్యకార్యమని భావిస్తూ నూర్ బాషా దూదేకుల సేవా సంఘం గౌరవాధ్యక్షులు నేతాజీ దస్తగిరి నిరుపేద మహిళలకు నిత్యావసరాల కిట్లు, చీరలను పంపిణీ చేశారు. స్థానిక కేవీ రెడ్డి నగర్ లోని తన నివాసం వద్ద సోమవారం షబ్-ఏ-ఖరత్ (సతామి) పర్వదినాన్ని పురస్కరించుకొని నూర్ బాషా దూదేకుల సేవా సంఘం గౌరవాధ్యక్షులు నేతాజీ దస్తగిరి ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా నేతాజీ దస్తగిరి మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో పేదలను ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతయని తెలిపారు. సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరూ తమ వంతుగా సహాయం చేస్తే ఎన్నో కుటుంబాలకు ఉపశమనం కలుగుతుందన్నారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన నిరుపేద కుటుంబాలు రంజాన్ మాసాన్ని ఆనందంగా గడపడానికి ఈ విధమైన సహాయాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఒక్కో కిట్‌లో 5 కేజీల గోదుమపిండి, లీటర్ సన్ ఫ్లవర్ ఆయిల్, కేజీ కంది బేడలు, కేజీ ఉప్మా రవ్వ, కేజీ వేరుశనగ విత్తనాలు, కేజీ చక్కెర, కేజీ కారంపొడి, కేజీ పెసర బేడలు, కేజీ సేమియాలు, కేజీ కొబ్బరి, అరకేజీ శనగ బేడలు, అరకేజీ తెల్ల గడ్డలు, అరకేజీ పప్పులు, అరకేజీ ఉద్ది బేడలు, ధనియాల పొడి ప్యాకెట్, పసుపు ప్యాకెట్, ఉప్పు ప్యాకెట్ వంటి నిత్యావసర సరుకులు ఉన్నాయి. మొత్తం రూ.1250 విలువ చేసే ఈ నిత్యవసర కిట్లను 40 మంది నిరుపేద కుటుంబాలకు అందజేశారు. అనంతరం నేతాజీ దస్తగిరి కుమారులు దేవరాజ కుమార్, నాగ మల్లేష్ ఆధ్వర్యంలో 40 మంది నిరుపేద మహిళలకు రూ.400 విలువ చేసే చీరలను పంపిణీ చేశారు. ఈ సహాయాన్ని అందుకున్న మహిళల కుటుంబ సభ్యులు సేవా సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.
ఈ సందర్భంగా నూర్ బాషా దూదేకుల సేవా సంఘం అధ్యక్షుడు హుస్సేన్ పీరా మాట్లాడుతూ సమాజంలో పేదలను ఆదుకోవడం కోసం నేతాజీ దస్తగిరి ఇలాంటి సేవా కార్యక్రమాలను తరచూ నిర్వహిస్తున్నాడని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూర్ బాషా దూదేకుల సేవా సంఘం సభ్యులు సిలార్ దస్తగిరి, మెకానిక్ దస్తగిరి, కడియాల పెద్ద హాజీతో పాటు సంఘ సభ్యులు, పలువురు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.


నిత్యావసరాల కిట్ అందజేస్తున్న దృశ్యం


చీరలు పంపిణీ చేస్తున్న చిన్నారి


కొబ్బరి చెట్టుపై పిడుగు పడటంతో చెలరేగుతున్న మంటలు

# శీరిలో కొబ్బరి చెట్టుపై పడిన పిడుగు

*తప్పిన పెను ప్రమాదం..*

**బెళగుప్ప (తెలుగోడు), మార్చి 16 :**
బెళుగుప్ప మండలం పరిధిలో శీర్పి గ్రామంలోని ఎస్సీ కాలనీలో సోమవారం రాత్రి కొబ్బరి చెట్టుపై పిడుగు పడడంతో భారీగా మంటలు చెలరేగాయి. రాత్రి ఒక్కసారిగా భారీగా ఈదురు గాలులు వీచి, ఓ మోస్తారులో వర్షం పడడంతో విద్యుత్ సరఫరా సైతం ఆగిపోయింది. ఆ సమయంలోనే ఎత్తైన కొబ్బరి చెట్టుపై పిడుగు పడటంతో మంటలు చెలరేగాయి చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని గ్రామస్తులు పేర్కొన్నారు.


పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

# పొట్టి శ్రీరాములుకు ఘన నివాళులు

*దూదేకుల సేవా సంఘం సభ్యులు..*

**తాడిపత్రి (తెలుగోడు), మార్చి 16 :**
స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్ సర్కిల్ వద్ద ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నూర్ భాషా దూదేకుల సేవా సంఘం సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నూర్ భాషా దూదేకుల సేవా సంఘం అధ్యక్షుడు హుస్సేన్ పీరా మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం నిరాహార దీక్ష చేపట్టి, తన ప్రాణాలను అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. భాషా ఆధారంగా రాష్ట్రాల ఏర్పాటు కోసం ఆయన చేసిన పోరాటం వలనే ఆంధ్ర రాష్ట్రం ఆవిర్భవించిందని తెలిపారు. అలాంటి మహనీయుడి త్యాగస్ఫూర్తి యువతకు ఆదర్శమని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచు కోవాలని పిలుపునిచ్చారు.
అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం వల్లే తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం లభించిందని, ఆయన త్యాగం ఆంధ్రప్రదేశ్ ప్రజల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోతుందని అన్నారు. సమాజం కోసం తన ప్రాణాలను అర్పించిన మహనీయులను స్మరించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నూర్ బాషా దూదేకుల సేవా సంఘం సభ్యులు ఫకృద్దీన్, కడియాల హాజీ తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి పబ్లిక్ ప్రారంభం

*మూడు సెంటర్లలో ఏడుగురు విద్యార్థులు గైర్హాజరు .. ఎంఈఓ కాశప్ప..*

**యాడికి (తెలుగోడు), మార్చి 16 :**
యాడికి మండలంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. సోమవారం పరీక్ష కేంద్రానికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్క్వాడ్ డిప్యూటీ డిఇఓ లక్ష్మణ్ వచ్చి తనిఖీలు చేశారు. మండలంలో యాడికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. ఏ. యాడికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. బి. తోపాటు ప్యారడైజ్ పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మూడు సెంటర్లకు 750 మంది విద్యార్థులకు7 ఏడు మంది విద్యార్థులు గే హాజరయ్యారు . యాడికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. ఏ. సెంటర్కు చీఫ్ సూపరింటెంట్ గా సుబ్రమణ్యం . యాడికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బి కేంద్రానికి చీఫ్ సూపరింటెంట్ గా మనోహర్ రెడ్డి. ప్యారడైజ్ పాఠశాల సెంటర్కు చీఫ్ సూపరింటెంట్ గా శ్రీవాసారెడ్డి ఉన్నారు. యాడికి జిల్లా పరిషత్ పాఠశాల ఏ సెంటర్కు 260 మంది విద్యార్థులకు 2 మంది విద్యార్థులు పరీక్షకు రాలేదు. యాడికి జిల్లా పరిషత్ పాఠశాల బి సెంటర్ కు 263 మంది విద్యార్థుల కు ముగ్గురు విద్యార్థులు పరీక్షకు రాలేదు. ప్యారడైజ్ పాఠశాల సెంటర్ కు 227 మంది విద్యార్థులకు ఇద్దరు విద్యార్థులు పరీక్షకు రాలేదు మొత్తం మూడు సెంటర్లకు 750 మంది విద్యార్థులకు ఏడు మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదని విద్యాశాఖ అధికారి కాశప్ప తెలిపారు. పరీక్ష కేంద్రాలను ఎంఈఓ కాశప్ప పరిశీలించారు.


పదవ తరగతి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తున్న స్క్వాడ్


షబ్-ఏ-ఖదర్ వేడుకల్లో పాల్గొన్న ముస్లింలు

## వైభవంగా షబ్-ఏ-ఖదర్

**మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు..**
**రాత్రంతా జాగరణ చేసిన ముస్లిం సోదరులు..**

**బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 16 :**
రంజాన్ మాసంలో అత్యంత పవిత్రమైన రాత్రిగా భావించే షబ్-ఏ-ఖదర్ వేడుకలను బత్తలపల్లి మండలంలో ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. సోమవారం రాత్రి మండల కేంద్రంలోని మసీదులతో పాటు పలు గ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా ముస్లిం భక్తులు పెద్ద సంఖ్యలో మసీదులకు చేరుకుని అల్లాహ్‌కు ప్రార్థనలు చేశారు. రాత్రంతా జాగరణ చేస్తూ పవిత్ర ఖురాన్ పఠనం, ప్రత్యేక నమాజులు నిర్వహించారు. తమ కుటుంబాల శ్రేయస్సుతో పాటు దేశం, సమాజం శాంతిగా ఉండాలని ప్రార్థించారు. మత పెద్దలు మాట్లాడుతూ రంజాన్ మాసపు చివరి పది రోజుల్లో వచ్చే ఈ రాత్రి చాలా పవిత్రమైనదని తెలిపారు. ఈ ఒక్క రాత్రి చేసే ప్రార్థనలు వేయి నెలల ప్రార్థనల కంటే ఎక్కువ పుణ్యం ఇస్తాయని ముస్లింల విశ్వాసమని చెప్పారు. పవిత్ర ఖురాన్ కూడా ఈ రాత్రే అవతరించిందని వారు వివరించారు. మసీదుల వద్ద భక్తులకు ఇబ్బందులు లేకుండా కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జాగరణలో పాల్గొన్న వారికి అన్నదాన కార్యక్రమాలు కూడా నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో షబ్-ఏ-ఖదర్ వేడుకల్లో పాల్గొన్నారు.


టెంకాయల వేలంపాట దక్కించుకున్న వారితో ఆలయ కమిటీ సభ్యులు

## శ్రీ కాటికోటేశ్వర స్వామి సన్నిధిలో రూ.3.5 లక్షలకు టెంకాయల వేలం

**బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 16 :**
మండలంలోని ఈదుల ముష్టూరు శ్రీ కాటికోటేశ్వర స్వామి దేవస్థానంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం టెంకాయల వేలం జరిగింది. వేలంపాటకు మూడు రోజుల ముందుగా ఈదుల ముష్టూరు గ్రామంలో దండోరా వేయించి వేలంపాట నిర్వహించారు. శ్రీ కాటి కోటేశ్వర క్షేత్రంలో టెంకాయలు అమ్ముకోవడానికి వేలంపాటను కమిటీ సభ్యులు రూ.10 వేల ప్రారంభ ధరతో ప్రారంభమైన వేలం పోటాపోటీగా సాగి చివరకు రూ.3.50 లక్షలకు చేరింది. ఈ వేలం పాటను తలారి నరసింహుడు సొంతం చేసుకున్నారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఈ ప్రక్రియ నిర్వహించారు. వేలం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఆసక్తిగా వీక్షించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సుధాకర్ రెడ్డి, రవీంద్ర రెడ్డి, కుమ్మర శ్రీరాములు, బత్తిని కొండన్న, శివయ్య, చంద్రశేఖర్, ధర్మవరం శివయ్య, బాలప్ప, బాయికాడ బత్తినన్న, బత్తిని బత్తినన్న, చిట్టి, బోయ సాంబశివ, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.


ప్రమాదంలో మృతి చెందిన అక్కిం రెడ్డప్ప

## రెండు ద్విచక్రవాహనాలు ఢీ ఒకరు మృతి

**బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 16 :**
బత్తలపల్లిలోని ఆర్డీటి ఆసుపత్రి సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. బత్తలపల్లి పోలీసులు తెలిపిన వివరాలు..తాడిమర్రి మండలం మరువపల్లి గ్రామానికి చెందిన మదన్మోహన్ మరో ఇద్దరితో కలిసి ద్విచక్రవాహనంలో ఆర్డీటి ఆసుపత్రి వద్దకు వచ్చి తిరుగు ప్రయాణం అయ్యారు. మెయిన్ గేట్ వద్ద వాహనాన్ని ఆపి ఉంచగా వారిలో ఒకరు దిగారు. ఇదే సమయంలో బత్తలపల్లి మండలం గంటాపురం గ్రామానికి చెందిన అక్కిం రెడ్డప్ప (35) వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో బత్తలపల్లికి వస్తున్నాడు. ముందుగా ఆపి ఉన్న ద్విచక్రవాహనాన్ని గమనించక వెనుక నుంచి ఢీకొట్టడంతో రెడ్డప్ప వాహనం నుంచి ఎగిరిపడ్డాడు. ఈ ప్రమాదంలో ఆయన తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆర్డీటి ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుని భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

# బాలికల ఆరోగ్య రక్షణకు హెచ్‌పీవీ టీకా

**సంజీవపురం కస్తూరిబా పాఠశాలలో టీకా కార్యక్రమం పరిశీలన..**
**మంత్రి సత్యకుమార్ యాదవ్..**

**బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 16 :**
బాలికలను గర్భాశయ క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల నుండి రక్షించేందుకు హెచ్పీవీ టీకా కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని సంజీవపురం వద్దనున్న కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో నిర్వహించిన హెచ్‌పీవీ టీకా కార్యక్రమాన్ని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్వయంగా సందర్శించి టీకా అమలు విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బందిని అడిగి టీకా ప్రక్రియపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గర్భాశయ క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను ముందుగానే నివారించేందుకు బాలికలకు హెచ్‌పీవీ టీకా అందిస్తున్నట్లు తెలిపారు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా ఆరోగ్య రంగంలో అనేక కీలక కార్యక్రమాలు అమలు అవుతున్నాయని పేర్కొన్నారు. బాలికల ఆరోగ్య పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, అదే దిశగా ఈ టీకా కార్యక్రమం అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని, అయితే ముందస్తు జాగ్రత్తలు మరియు అవగాహన ద్వారా చాలా వరకు క్యాన్సర్‌ను నివారించవచ్చని మంత్రి చెప్పారు. పొగాకు వినియోగం, సిగరెట్ తాగడం, అనారోగ్యకరమైన ఆహారం, పరిశు


హెచ్పివి టీకాను ప్రారంభిస్తున్న మంత్రి సత్య కుమార్ యాదవ్


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్య కుమార్ యాదవ్

భ్రత లోపం, వ్యాయామం చేయకపోవడం వంటి కారణాల వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం పెరుగుతుందని వివరించారు. మహిళల్లో బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ ఎక్కువగా కనిపిస్తున్నాయని తెలిపారు. ఆరోగ్య మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే రాష్ట్ర ప్రజలకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు అందించే కార్యక్రమానికి సంబంధించిన ఫైల్‌పై తాను తొలి సంతకం చేసినట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు గ్రామాల వరకు వెళ్లి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. బాలికలు ఆరోగ్యంగా ఉంటేనే చదువులో మంచి ఫలితాలు సాధించగలరని మంత్రి సూచించారు. చదువుపై దృష్టి పెట్టి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరాలని విద్యార్థినులను ప్రోత్సహించారు. బాలికల ఆరోగ్య భద్రత కోసం ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఫైరోజా బేగం, డిప్యూటీ డిఎంహెచ్వో భాగ్యలక్ష్మి, ఎంపీడీవో నరసింహా నాయుడు, తాహసిల్దార్ స్వర్ణలత, వైద్యాధికారి అరుణ్ కుమార్, కేజీబీవీ ప్రిన్సిపాల్ గుల్జర్ బేగం, బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి జెడ్పిటిసి కోటి సుధా, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ముల్లగురు సురేంద్ర నాయుడు, భాజపా మండల కన్వీనర్ ఆకులేటి భాస్కర్, మాజీ కన్వీనర్ ఆకులేటి వీరనారప్ప, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు కేసనపల్లి వెంకట చౌదరి, మాజీ వైస్ ఎంపీపీ గొల్లపల్లి వెంకటేశ్వర చౌదరి, కావేటి మల్లికార్జున, ముల్లగురు అయ్యప్ప, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు సుబ్బరాయుడు, జనసేన మండల అధ్యక్షులు పురం శెట్టి రవి, వడ్డే తిరుపతయ్య, కుమ్మర గుర్రప్ప, డి.చెర్లపల్లి నారాయణస్వామి, బొంతల ఉజ్జినప్ప, ముసుగు రామచంద్ర, యుగంధర్ రెడ్డి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# రైతన్న మీ కోసం వారోత్సవాలు ప్రారంభం

**పంచ సూత్రాలు, ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన ..**
**ఎలనినో, యుద్ధం ప్రభావంపై చర్చ..**

**అగళి (తెలుగోడు), మార్చి 16 :**
రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ నెల 16,17,18, 23, 24,25 తేదీలలో 'రైతన్నా మీ కోసం' కార్యక్రమాన్ని అగళి మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో నిర్వహించనున్నారు. అందులో భాగంగా సోమవారం మండలంలోని అగళి రైతు సేవా కేంద్రంలో ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఆర్జీపల్లి రైతు సేవా కేంద్రం పరిధిలో సర్పంచ్ సన్నమ్మ రంగయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్ని రైతు సేవా కేంద్రాలలో నిర్దేశించిన కమిటీ సభ్యుల ద్వారా ఇంటింటా తిరిగి గౌరవ ముఖ్యమంత్రివర్యులు ఇచ్చినటువంటి లేఖను ఇస్తూ అదే విధంగా ఆ లేఖలో ఉన్నటువంటి నీటి భద్రత,డిమాండ్ ఆధారిత పంటలు సాగు, వ్యవసాయం లో సాంకేతికత ఆహార శుద్ధి,ప్రభుత్వ మద్దతు- రైతులకు పెట్టుబడి సాయంగా అన్నదాతా సుఖీభవ - పీఎం కిసాన్ పథకం కింద మూడు విడతల్లో ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున అర్హత ఉన్న రైతు కుటుంబాలకు ఇవ్వడం జరిగింది.అని తెలియజేసి ప్రభుత్వం నుంచి రైతులు లబ్ధి పొందుతున్న వివిధ రకాల పథకాలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాల గురించి, ఎల్ నినో,మిడిల్ ఈస్ట్ వార్ ప్రభావం గురించి తెలియజేశారు.

వాతావరణ పరిస్థితులు,మారుతున్న కాలానికి అనుగుణంగా డిమాండ్


ఆర్‌జి పల్లిలో రైతన్న మీకోసం కరపత్రాలను ప్రదర్శిస్తున్న సర్పంచ్ సన్నమ్మ రంగయ్య

ఆధారిత పంటలను ప్రకృతి వ్యవసాయం పద్ధతులు వాడుతూ రసాయనాల వాడకాన్ని తగ్గించి వివిధ రకాల పంటలు సాగు చేయాలని ముఖ్యంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులైన ప్రీ మన్సూన్ డ్రై సోయింగ్,పెల్లెటైజేషన్,డ్రాట్ ప్రూఫ్ మోడల్,హాఫ్ మూన్ మోడల్,ఏటీఎం,ఏ గ్రేడ్ మోడల్స్ లలో ఘన,ద్రవ బీజామృతాలు,కషాయాలు వాడాలని, చిరుధాన్యాలు, మల్బరీ, ఉద్యానవన పంటలు,పాడి చేపట్టాలని అలాగే నూతన టెక్నాలజీలో భాగంగా ఫార్మర్ ఐడి, ఈ పంట ఫార్మర్ ఈ కేవైసి చేసి,ఏపీ ఎయిమ్స్ రైతు యాప్ ఇన్స్టాల్ చేస్తూ,కిసాన్ డ్రోన్, డ్రిప్, స్ప్రింకలర్స్ గురించి తెలిపి ఇంటింటి సర్వేలో పాల్గొన్న రైతులు వివరాలు కూడా రైతన్న మీకోసం యాప్లో అప్లోడ్ చేయడం జరుగుతుంది అని మండల వ్యవసాయ అధికారి నాగరాజు తెలియజేయడం జరిగింది,ఈ కార్యక్రమం లో జడ్పిటిసి ఉమేష్, మండల కన్వీనర్ తిప్పేస్వామి, సీనియర్ నాయకులు జిల్లా పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసులు,రైతులు ప్రభుత్వం అందజేసే పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రైతులు,అధికారులు పాల్గొన్నారు.


రైతన్న మీకోసం కరపత్రాలను ప్రదర్శిస్తున్న జెడ్పిటిసి ఉమేష్

# పదవ తరగతి పరీక్ష కేంద్రాల తనిఖీ

**తహసీల్దార్ చంద్రశేఖర్..**

**రొళ్ల (తెలుగోడు), మార్చి 16 :**
మండలంలో జరుగుతున్న పదవ తరగతి పరీక్షా కేంద్రాలను సోమవారం తహసీల్దార్ చంద్రశేఖర్ మండల విద్యాశాఖ అధికారి ఎస్.ఎన్ శ్రీధర్ తనిఖీ చేశారు. ఈ సందర్బంగా మండలంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పరీక్షా కేంద్రంలో 235 మంది విద్యార్థులకు గాను 224 మంది విద్యార్థులు హాజరయ్యారని 11 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని అదేవిధంగా కేజీబీవీ పరీక్షా కేంద్రంలో మొత్తం 225 మంది విద్యార్థులకు గాను 222 మంది విద్యార్థులు హాజరయ్యారని 03 విద్యార్థులు గైరహాజరయ్యారన్నారు అంబేద్కర్ గురుకుల పాఠశాల పరీక్షా కేంద్రంలో సెంటర్ చీఫ్ ఎల్.ఆర్ గోపి, డిపార్ట్మెంటల్ ఆఫీసర్ ఎల్.రాఘవేంద్ర, కేజీబీవీ పరీక్షా కేంద్రంలో సీస్ జి.పవన్ కుమార్ రెడ్డి,డి,ఓ జనార్ధన్ పర్యవేక్షణ లో పరీక్షలు జరిగాయి.అనంతరం వారితో మాట్లాడుతూ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని తెలియజేయజేశారు.అలాగే విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సజావుగా పరీక్షలు నిర్వహించాలని సూచించారు.అదేవిధంగా వైద్యశాఖ వారిని ప్రతిరోజూ అందుబాటులో ఉండి విద్యార్థులకు అత్యవసర చికిత్స లు అందుబాటులో


గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్

ఉండెలా చూడాలన్నారు. అదేవిధంగా సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఇతరులు ఎవరు ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్షా కేంద్రంలోనికి గాని పరీక్షా కేంద్రం చుట్టుపక్కల గాని ప్రవేశించకుండా తనిఖీ చేసి జాగ్రత్త తీసుకోవాలని సూచించారు.అలాగే విద్యార్థులకు ప్రతి రోజు తాగునీరు అందుబాటులో ఉంచాలని తెలియజేసారు.



కేజీబీవీ పాఠశాల పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎం ఇ ఓ శ్రీధర్


అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

## అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

**ఎంపీడీవో కార్యాలయంలో 125వ జయంతి వేడుకలు**

**బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 16 :**
ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు, అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలను సోమవారం బత్తలపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ.. తెలుగు జాతికి ప్రత్యేక రాష్ట్రం కల్పించేందుకు 58 రోజుల పాటు మద్రాసులో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి అసువులు బాసిన త్యాగధనుడు శ్రీరాములు అని కొనియాడారు. తెలుగు వారి భాషా, సంస్కృతుల పరిరక్షణలో ఆయన పాత్ర చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.


వైద్యశిబిరంలో పాల్గొన్న కంటి రోగులు

## ఎం. రాయపురం పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం

**ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ఏపీ కోఆర్డినేటర్ వై. వెంకటేష్..**

**రొళ్ల (తెలుగోడు), మార్చి 16 :**
రొళ్ల మండలం ఎం. రాయపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నీలకంఠాపురం శాంతా, జయరాం వైద్య విజ్ఞాన సంస్థ ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ఏపీ కోఆర్డినేటర్ వై. వెంకటేష్ మాట్లాడుతూ, కంటి చూపు పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కంటిని కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం ప్రాముఖ్యతను వివరించారు. ఈ శిబిరంలో వైద్యా పరీక్షలు నిర్వహించి, కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించామని, వారికి నీలకంఠాపురంలోని ఆసుపత్రిలో ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నర్సింహప్ప, పాఠశాల హెడ్మాస్టర్ రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కారం

**జడ్పిటిసి ఉమేష్ చొరవ..**
**వద్రహట్టి గ్రామ ప్రజల హర్షం..**

**అగళి (తెలుగోడు), మార్చి 16 :**
వద్రహట్టి గ్రామంలో తాగునీటి సమస్య జడ్పిటిసి ఉమేష్ చొరవతో పరిష్కారం అయిందని గ్రామ ప్రజలు తెలిపారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆదేశాల మేరకు సోమవారం అగళి జడ్పీటీసీ ఉమేష్ అగళి మండలం హెద్ది హళ్లి పంచాయతీ వద్రట్టి లో త్రాగునీరు సమస్య ఉందని తెలుసుకున్న జడ్పిటిసి ఉమేష్ వెంటనే అక్కడికి వెళ్లి ప్రజలతో మాట్లాడి సమస్య తెలుసుకొని సోమవారం సాయంత్రం బోరు బావిలో పైపులు మోటర్ పంపు సెట్లను దింపారు.దీంతో నీటి సమస్య తీరిందని తెలిపారు.కార్యక్రమం లో జడ్పిటిసి ఉమేష్ వెంట కల్చరల్ సెల్ అధ్యక్షుడు రాజన్న,పంచాయతీ అధ్యక్షుడు రఘు, పంచాయతీ సెక్రటరీ జీవన్,లైన్ మెన్ మహేష్,కృష్ణ నాయక్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు


బోరుబావిలోకి మోటార్ పంపు సెట్లను దింపిస్తున్న జడ్పిటిసి ఉమేష్

## రైతన్న మీకోసం వారోత్సవాలు

**ప్రకృతి వ్యవసాయంపై అవగాహన..**
**వ్యవసాయ అధికారి మంజునాథ్ ..**

**అమరాపురం (తెలుగోడు), మార్చి 16 :**
రైతుల సంక్షేమం, స్థిరమైన వ్యవసా6యాన్ని ప్రోత్సహించడానికి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో "రైతన్న మీకోసం" కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి మంజునాథ్ పేర్కొన్నారు.. ఈ కార్యక్రమం మార్చి 16 నుండి 18 వరకు, మార్చి 23 నుండి 25 వరకు మండలంలోని అన్ని గ్రామాలలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్-నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వర్షాభావం వచ్చే అవకాశాలను పరిశీలిస్తూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ (వర్షాలకు ముందే విత్తనాలు వేయడం) ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. తక్కువ వర్షపాతం ఉన్న పరిస్థితుల్లో కూడా పంటలు విజయవంతంగా సాగు చేయడానికి ప్రకృతి వ్యవసాయం ద్వారా అనుసరించాల్సిన పద్ధతులను అధికారులు రైతులకు తెలియజేశారు. మండలంలో ప్రకృతి వ్యవసాయాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, జీవామృతం, కషాయాలు వంటి సహజ ఇన్‌పుట్స్ వినియోగం, నేల ఆరోగ్య పరిరక్షణ గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులకు ఫార్మర్ యాప్ గురించి వివరించారు. యాప్ ద్వారా పంటల వివరాలు నమోదు చేయడం, పంటలకు సంబంధించిన సలహాలు పొందడం, ప్రభుత్వ పథకాల సమాచారం తెలుసుకోవడం, వాతావరణ సమాచారం పొందడం వంటి ఉపయోగాలను రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మంజునాథ్ , రైతు సేవా కేంద్రం సిబ్బంది, ప్రకృతి సేద్య విభాగ సిబ్బంది , రైతులు పాల్గొన్నారు. రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.


రైతన్న మీకోసం వారోత్సవాల్లో ఇంటింటా ప్రచారం చేస్తున్న వ్యవసాయ అధికారులు



కలుషిత తాగునీటి సరఫరాపై ఎంపీడీవో ప్రభావతి దేవికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

# ఎస్సీ కాలనీలో కలుషిత తాగునీటి సరఫరా

**కాంట్రాక్టర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈపై చర్యలు తీసుకోవాలని వినతి..**

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 16 :**
మండల కేంద్రమైన పెద్దకడబూరులోని ఎస్సీ కాలనీకి శుద్ధి చేయని తాగునీటిని సరఫరా చేస్తున్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ కాంట్రాక్టర్‌తో పాటు ఆర్డబ్ల్యూఎస్ ఏఈపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోసిగి మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ బొగ్గుల తిక్కన్న డిమాండ్ చేశారు. సోమవారం స్తానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రభావతి దేవికి ఆయన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తిక్కన్న మాట్లాడుతూ పెద్దకడబూరులోని ఎస్సీ కాలనీకి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ద్వారా ప్రతి ఐదు రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా చేస్తున్నారని తెలిపారు. అయితే ఆ నీటిని శుద్ధి చేయకుండా నేరుగా పంపిణీ చేయడం వల్ల కాలనీవాసులకు కలుషిత నీరు అందుతున్నదని ఆరోపించారు. దీనివల్ల ప్రజలు అనారోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.
గత శుక్రవారం సరఫరా చేసిన తాగునీటిని తాగిన తర్వాత కాలనీలో పలువురు ప్రజలు విషజ్వరాల బారిన పడినట్లు తెలిపారు. ఈ విషయాన్ని సంబంధిత కాంట్రాక్టర్‌కు, రూరల్ వాటర్ సప్లై అండ్ శానిటేషన్ విభాగం ఇంజనీరింగ్ అధికారులకు పలుమార్లు తెలియజేసినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన విమర్శించారు. ఎస్సీ కాలనీ కావడంతోనే వివక్షతతో శుద్ధి చేయని నీటిని సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సురక్షితమైన తాగునీరు పొందే హక్కును కల్పించిందని పేర్కొన్నారు. అయినప్పటికీ దళిత కాలనీల పట్ల ఇలాంటి నిర్లక్ష్యం చూపడం సామాజిక వివక్షకు నిదర్శనమని అన్నారు. కాబట్టి అధికారులు వెంటనే స్పందించి సంబంధిత కాంట్రాక్టర్‌తో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈపై కఠిన చర్యలు తీసుకుని, ఎస్సీ కాలనీ ప్రజలకు శుద్ధి చేసిన సురక్షిత తాగునీటిని క్రమం తప్పకుండా సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీ సభ్యులు జంబన్న, మండల తెలుగు యువత నాయకులు రామన్న తదితరులు పాల్గొన్నారు.



పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తులో ఉన్న సిబ్బందికి సూచనలు చేస్తున్న సిఐ మంజునాథ్

# పరీక్షా కేంద్ర్రాల వద్ద బందోబస్తు

**సిఐ మంజునాథ్..**

**కోసిగి (తెలుగోడు), మార్చి 16 :**
కోసిగిలోని పదవ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తు ను సిఐ మంజునాథ్ పరిశీలించారు.ఈ సందర్భంగా మౌంట్ కార్మెల్ హైస్కూల్, బాలికల హైస్కూల్ మరియు బాయ్స్ హైస్కూల్ లోని రెండు సెంటర్లను పరిశీలించి బందోబస్తు నిమిత్తం వున్న సిబ్బంది కి తగు సూచనలు చేసి నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది మైనర్ విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్న క్రమంలో ద్విచక్ర వాహనాలు నడుపుతూ రావడం గమనించామని, దీనివలన అనుకోని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆయన అన్నారు.అందువలన విద్యార్థులు పరీక్ష రాసే అవకాశం కోల్పోయే అవకాశం కూడా వుందని, కావున విద్యార్థుల యొక్క తల్లిదండ్రులు సూచనలను గమనించి, మైనర్లు అయినటువంటి మీ యొక్క పిల్లలకు ద్విచక్ర వాహనాలను ఇచ్చి పంపవద్దని సూచిస్తున్నట్లు తెలిపారు.

# టిడిపికి ఎన్.వి.రమణ రాజకీయ సలహాలు!

**ముసుగు తొలగించుకున్న సుప్రీం మాజీ ప్రధాన న్యాయమూర్తి..**

సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి.రమణ టిడిపికి రాజకీయ సలహాదారుడిగా మారిపోవడాన్ని చూస్తే ఆయన సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా ఇచ్చిన తీర్పులపై అనుమానాలు కలుగక మానవు. అందరూ ఊహించినట్లుగానే ఎన్.వి.రమణ తన ముసుగు తానే తొలగించుకున్నారు. కరుడుగట్టిన టిడిపి నాయకుడు కోమటి జయరాం సన్మానసభ సందర్భంగా ఎన్ వి రమణ మాట్లాడుతూ ఎవరు చేయనంత మేలు టిడిపికి కోమటి జయరాం చేశారని, అందుకు ప్రతిఫలంగా అతనికి పార్టీలో సముచిత స్థానం కల్పించాలని,అలాగే చంద్రబాబు జైలుకు వెళ్లి పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు, అమరావతి భూముల పోరాటం చేస్తున్న రైతుల పక్షాన నిలబడి న్యాయ సలహాలతో పాటు ఆర్థిక సహాయం చేసిన కోమటి జయరాం లాంటి వారికి పార్టీలో సముచిత స్థానం కల్పించడంతోపాటు లాభదాయకమైన పదవులు ఇచ్చి ఆదుకోవాలని టిడిపికి రాజకీయ సలహాలు ఇవ్వడం బట్టి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన తెలుగు వాడిగా గర్వపడదామా,ఇలాంటి చౌకబారు,దిగజారుడు రాజకీయ సలహాలు ఇచ్చినందుకు బాధపడదామా. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నప్పుడు అతను ఉన్నంతకాలం నాకు న్యాయం జరగదని, నా కేసు విషయంలో అతని తప్పించాలని కోరిన ఆనాటి ముఖ్యమంత్రి నేడు ప్రతిపక్ష నాయకుడు అయిన వైయస్ జగన్మోహన్ రెడ్డి మాటలు అక్షర సత్యాలని, టిడిపి ఫాలోయర్ నని తనకు తానుగా రుజువు చేసుకున్నారు.



కెవిఆర్ విశ్లేషణ

ఇంతవరకు తెలుగు ప్రజల శ్రేయోభిలాషి నని చెప్పుకుంటున్న ఎన్ వి రమణ గారు తనంతకు తానుగా నేను తెలుగు ప్రజల శ్రేయోభిలాషిని కాను,తెలుగుదేశం పార్టీ శ్రేయోభిలాషినని ఒప్పుకున్నట్లు అయ్యింది. కోమటి జయరాం గత ఎన్నికల సందర్భంగా పేద ఓటర్లు వెధవలని,వారిని నయానో భయానో,ఓటుకు 5వేల రూపాయలైనా ఇచ్చి ప్రతి గ్రామంలో 10 కుటుంబాలను మార్చి వైసిపిని ఓడగొట్టడానికి గట్టిగా కృషి చేయాలని చెప్పిన టిడిపి సిద్ధాంతకర్త.అలాంటి కోమటి జయరాం మహోన్నతుడుగా,రాష్ట్ర అభివృద్ధికి తోడ్పాటునిచ్చిన గొప్ప మనిషిగా కొనియాడిన రమణ వ్యక్తిత్వాన్ని, అంతర్గతంగా తెలుగుదేశం పార్టీతో అతనికి ఉన్న బంధాన్ని ఆంధ్ర ప్రజలకు అర్థమైపోయింది.
యుద్ధంలో శిఖండి రాజకీయాలు నడపడం చేతగాని వారి నైజం. ఎదురుగా నిలబడి యుద్ధం చేయడం వీరుని లక్షణం అలాగే నేరుగా రాజకీయాలలోకి వచ్చి రాజకీయాలు చేయాలే గాని తెర మరుగున ఉండి తమ అధికారాలను అంగడిలో సరుకు లాగా అమ్ముకుని పదవి పోయిన తర్వాత ఒక రాజకీయ పార్టీ పంచన చేరడం ఆ పదవికి కలంకం. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తుల స్థాయిలో పనిచేసిన వారు,పదవి పోయిన తరువాత ఇలా రాజకీయ పార్టీల పంచన చేరడం,న్యాయవ్యవస్థ పై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని వమ్ము చేయడమే.
ఈ మధ్యకాలంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులుగా పనిచేసినవారు కొందరు తమ పదవీకాలం ముగిసిన వెంటనే రాజకీయ పార్టీల పంచన జేరి ఎంపీలుగా,రాజ్యసభ సభ్యులుగా,గవర్నర్లుగా ఎన్నిక అవుతున్నారంటే వారి పదవీకాలంలో ఏ విధంగా న్యాయం జరిగి ఉంటుందో, ఎవరి పక్షాన తీర్పులు చెప్పి ఉంటారో మెడ మీద తల ఉన్న ఎవరికైనా తెలిసిపోతుంది. అందుకే ఆత్మ శుద్ధి లేని ఆచార బాండ మేల,బాండ శుద్ధి లేని పాకమేల,చిత్తశు ద్ధి లేని శివ పూజ లేల , ఉప్పు కప్పురంబు నొక్క పోలికనుండు చూడ చూడ రుచుల జాడ వేరు పురుషులందు పుణ్య పురుషులు వేరు అని ఏనాడో చెప్పాడు వేమన.

**– కేవీ రమణ, రాజకీయ విశ్లేషకులు, అనంతపురం.**

# అన్నదాత సుఖీభవ మూడో విడత నిధులపై రైతులకు అవగాహన

**పెద్దకడబూరులో కరపత్రాల పంపిణీ ..**



అన్నదాత సుఖీభవ పథకం గురించి రైతులకు వివరిస్తున్న టీడీపీ నేత నరవ రమాకాంతరెడ్డి

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 16 :**
రైతుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి పేర్కొన్నారు. 'అన్నదాత సుఖీభవ' పథకం మూడో విడత నిధుల విడుదల సందర్భంగా సోమవారం పెద్దకడబూరు గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నరవ రమాకాంతరెడ్డి రైతులను కలుసుకుని కరపత్రాలను పంపిణీ చేస్తూ, ప్రభుత్వం రైతుల కోసం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల వివరాలను తెలిపారు. ముఖ్యంగా 'అన్నదాత సుఖీభవ' పథకం ద్వారా రైతులకు అందుతున్న ఆర్థిక సహాయం వారి వ్యవసాయ కార్యకలాపాలకు తోడ్పడుతుందని ఆయన తెలిపారు. ప్రభుత్వం రైతన్నల అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకొని పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
అలాగే ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన పెంచడం ద్వారా రైతులు మరింత ప్రయోజనం పొందగలరని పేర్కొన్నారు. రైతన్న సేవలో ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని, రైతుల అభివృద్ధికి కట్టుబడి పని చేస్తోందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డీలర్లు ఇమ్మానూయేల్ ఆదాం, హనుమంతు, స్కూల్ కమిటీ చైర్మన్ హనుమంతు, దేవసహాయం, బొగ్గుల నరసన్న, సుధాకర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నేత నరవ రమాకాంతరెడ్డి



ఎస్ఐ మారుతిని సన్మానిస్తున్న దళిత సంఘాల నాయకులు

# ఎస్ఐ మారుతిని కలిసిన నేతలు

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 16 :**
పెద్దకడుబూరు మండల పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ ఈ. మారుతిని సోమవారం బహుజన సేన సమితి రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం నాగేంద్ర మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ కర్నూలు జిల్లా అధ్యక్షురాలు కదిరికోట బతకమ్మ ఎస్ఐ మారుతిని కలిశారు. ఎస్ఐ మారుతికి శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో శాంతి భద్రతలను పరిరక్షిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. పోలీసు వ్యవస్థ సామాన్య ప్రజలకు అండగా నిలవాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బహుజన సేన సమితి నాయకులు, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**రావూస్ కళాశాలలో ఘనంగా**

# అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 16 :**
ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలను అర్పించిన మహనీయుడు పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు సోమవారం ఎమ్మిగనూరు పట్టణంలోని రావూస్ డిగ్రీ కళాశాలలో సీఈవో తిరుమల రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ జీఎండీ ఇర్ఫాన్, అధ్యాపకులు విజయ్ కుమార్, రాఘవేంద్ర, గోరంట్ల, ధనుంజయ అమరజీవి పొట్టి శ్రీరాముల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపల్ ఇర్ఫాన్ మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు 1901 మార్చి 16న జన్మించారని గుర్తు చేశారు. తెలుగు ప్రజల కోసం మద్రాసు రాష్ట్రం నుంచి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం సాధించాలనే సంకల్పంతో ఆయన 56 రోజుల పాటు నిరాహార దీక్ష చేపట్టి, 1952 డిసెంబర్ 15న ప్రాణత్యాగం చేశారని వివరించారు. ఆయన త్యాగం ఫలితంగానే దేశంలో భాషా ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటు దిశగా మార్గం సుగమమైందని పేర్కొన్నారు. అనంతరం 1953లో మద్రాసు రాష్ట్రం నుంచి విడిపోయి కర్నూలు రాజధానిగా ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఆవిర్భవించిందని గుర్తు చేశారు. అమరజీవి పొట్టి శ్రీరాములు భారత స్వాతంత్ర్య సమరయోధుడు మాత్రమే కాక గాంధేయవాది కూడా అని తెలిపారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని యువత సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. తరువాత విద్యార్థులు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగానికి కూడా వెనకాడని ధీరుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఆయన ఆశయ సాధనలో ముందుకు సాగుతామని తెలిపారు. అలాగే ఇటువంటి స్ఫూర్తిదాయక కార్యక్రమాలు నిర్వహిస్తున్న కళాశాల సీఈఓ తిరుమలరెడ్డి, సీఓఓ సుజనారెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు వెంకటేశ్వర్లు, కె.వీరేష్, పాలరాజ్, సంపత్, విజయ్ రాజు, ఎంబి.వీరేష్, సురేఖ, ధనుంజయ, గోవిందు, విద్యార్థులు పాల్గొన్నారు.



అమరజీవి పొట్టి శ్రీరాముల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అధ్యాపక సిబ్బంది



పొట్టి శ్రీరాముల జయంతి వేడుకలకు హాజరైన విద్యార్థులు



తహసీల్దార్ ప్రతాపరెడ్డికి వినతి పత్రం అందిస్తున్న సిపిఎం సిఐటియు నాయకులు

# గ్యాస్ సమస్యలు, అధిక ధరలపై చర్యలు తీసుకోండి

**తహసిల్దార్‌కు వినతి పత్రం..**
**సిపిఎం సిఐటియు నాయకులు..**

**యాడికి (తెలుగోడు), మార్చి 16 :**
యాడికి మండలంలో గ్యాస్ ఏజెన్సీ వారు మండల ప్రజలకు గ్యాస్ సమస్యలపై చాలా ఇబ్బంది పెడుతున్నారని కొందరు అధిక ధరలకు బ్లాక్ లో గ్యాస్ అమ్ముతున్నారని వెంటనే లాంటి వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ ప్రతాపరెడ్డి కు సిపిఎం.సిఐటియు నాయకులు ఆధ్వర్యంలో వినత పత్రం సమర్పించారు. సోమవారం సిఐటియు సిపిఎం నాయకులు తహసిల్దార్ ప్రతాప్ రెడ్డి కు వినతిపత్ర ఇచ్చి వివరిస్తూ ఇరాక్ యుద్ధం అంటూ గ్యాస్ సరఫరా సమస్యలు అంటూ బుకింగ్ కు ఐదు రోజులవుతున్న బుకింగ్ కావడం లేదని బుకింగ్ అయినా గ్యాస్ సరఫరా అంతరాయం జరుగుతున్నదని ఇదే ఆసరా చేసుకొని కొందరు అక్రమముగా అధిక రేటుతో అమ్ముకుంటున్నారని వీటి వలన ప్రజలకు చాలా ఇబ్బంది పడుతున్నారని వీటితో పాటు గ్యాస్ ధరను పెంచిన వాటిని తగ్గించాలని వీటిపై అధికారులు స్పందించి ప్రజలకు గ్యాస్ సరఫరా ఏజెన్సీ వారు సక్రమముగా అందివ్వాలని వారు కోరారు. మీరు చేయని యెడల సిపిఎం సిఐటియు ఆధ్వర్యంలో ప్రజల కోసం రోడ్లపైకి ఎక్కాల్చి వస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో. సిపిఎం మండల కార్యదర్శి బషీర్ అహ్మద్. సిఐటియు నాయకులు మహాలక్ష్మి. మాయకుంట మోహన్. బండారు రాఘవ. శ్రీనివాసులు. తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలం ముందు నవధాన్యాలను భూమిలో చల్లితే ఎన్నో ప్రయోజనాలు

**కోసిగి (తెలుగోడు), మార్చి 16 :**
వర్ష కాలమందు నవాదాన్యలను భూమిలో చల్లితే ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని మండల వ్యవసాయ అధికారి .వరప్రసాద్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆంజనేయులు అన్నారు. కోసిగి మండలంలోని అగసనూరు గ్రామములో మండల వ్యవసాయ అధికారి ఏం.వరప్రసాద్ ఆధ్వర్యంలో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రాలయం టిడిపి ఇన్చార్జ్ యన్.రాఘవేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని రైతులకు ప్రభుత్వం నుంచి అందించే వివిధ పథకాలపై అవగాహన కల్పించడం జరిగింది. కార్యక్రమాన్ని ఉద్దేశించి వ్యవసాయ సిబ్బంది మాట్లాడుతూ పి.ఎం.డి.ఎస్ విధానము అనగా వర్షాకాలం ముందు పొడి విత్తనాలు చల్లే పద్ధతి వల్ల అనేక ప్రయోజనాలు చేకూరుతాయని తొలకరి వర్షాలు పడిన తర్వాత నవధాన్యాలు మొలకెత్తి పూత దశకు చేరుకున్న తరువాత ప్రధాన పంట వేసే ముందు తొలుతవేసిన నవధాన్యాల పంటను కలియ దున్నటం వలన నేల సారవంతం అవ్వడమే కాకుండా ప్రధాన పంటకు పోషకాలు లభిస్తాయని అలాగే నిరంతరం భూమిని కప్పి ఉంచటం వలన భూమి తాపానికి సూక్ష్మజీవులు చనిపోకుండగా నేలను సంరక్షించుకోవచ్చని అలాగే ఈదురు గాలులకు మట్టి కొట్టుకొని పోకుండా నేలను సంరక్షించుకోవచ్చని తెలిపారు. పిఎండిఎస్ విధానంలో నాలుగు నెలల ముందే విత్తన గుళికలు తయారు చేసుకుని భూమిలో చల్లటం వలన తొలకరి వర్షాలు కురిసిన వెంటనే విత్తనాలు మొలకెత్తి నేల సారాన్ని పెంచడంలో తోడ్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలోమంత్రాలయం నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ రాజు కోసిగి టిడిపి మండల అధ్యక్షుడు పల్లెపాడు రామిరెడ్డి, సీనియర్ టిడిపి నాయకులు ముత్తిరెడ్డి, మండల తాహసీల్దార్ వేణుగోపాల్, ఇరిగేషన్ ఇంజనీర్ రవి ప్రసాద్, మార్కెటింగ్ అధికారి మహేశ్వరి, సొసైటీ ప్రెసిడెంట్ అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.



చిరుదాన్యలను పరిశీలిస్తున్న ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి

# సచివాలయం వ్యవస్థ దేశానికే ఆదర్శం

**ఢిల్లీ జాతీయ సమ్మేళనంలో అనంతపురం మేయర్ మహమ్మద్ వసీమ్**

**అనంతపురం రూరల్ (తెలుగోడు), మార్చి 16 :**
మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తీసుకొచ్చినటువంటి సచివాలయం వ్యవస్థ భారతదేశంతోపాటు ఇతర దేశాల్లోని వారు కూడా అబ్బురం అని కితాబు ఇస్తున్నారని అనంతపురం మేయర్ మహమ్మద్ వసీం సలీం పేర్కొన్నారు. సోమవారం ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మేళనానికి అనంతపురం మేయర్ వసీం హాజరయ్యారు . పట్టణాలు అభివృద్ధి కరణ – దీర్ఘకాలిక ఫలాలు అనే ఓ సెషన్ లో కూడా చర్చలో పాల్గొనడానికి నాకు అవకాశం ఇవ్వడం చాలా ఆనందంగా ఉందన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో – 1 ఉస్మాన్ బాషా

# పెద్దకడబూరులో ప్రారంభమైన టెన్త్ పబ్లిక్ పరీక్షలు

**మొదటి రోజు 10 మంది గైర్హాజరు..**

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 16 :**
పెద్దకడబూరు గ్రామంలో సోమవారం పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. తొలి రోజు నిర్వహించిన తెలుగు పరీక్షకు విద్యార్థులు భారీగా హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యాశాఖ అధికారులు, సిబ్బంది పకడ్బందీ ఏర్పాట్లు చేయడంతో పరీక్షలు ఎలాంటి అంతరాయం లేకుండా సజావుగా సాగాయి. పెద్దకడబూరులోని కస్తూరి బా గాంధీ బాలికల విద్యాలయంలో 135 మంది విద్యార్థులకుగాను 133 మంది పరీక్షకు హాజరుకాగా ఇద్దరు గైర్హాజరయ్యారు. అదే విధంగా ఏపీ మోడల్ స్కూల్‌లో 237 మందికి గాను 234 మంది విద్యార్థులు పరీక్ష రాయగా ముగ్గురు గైర్హాజరైనట్లు ఎంఈవో – 1 ఉస్మాన్ బాషా తెలిపారు. అలాగే జెడ్పీ హైస్కూల్‌లో 259 మందికి గాను 254 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా ఐదుగురు గైర్హాజరయ్యారు. ఈ విధంగా మూడు పరీక్షా కేంద్రాల్లో కలిపి మొత్తం 631 మంది విద్యార్థులకు గాను 621 మంది పరీక్షకు హాజరుకాగా 10 మంది గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారి ఉస్మాన్ భాష వెల్లడించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు 144 సెక్షన్ అమలు చేశారు. అలాగే విద్యార్థులకు తాగునీరు, ప్రాథమిక వైద్య సదుపాయాలు వంటి అవసరమైన ఏర్పాట్లు చేశారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా సిబ్బంది కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. తొలి రోజు పరీక్ష సాఫీగా సాగడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు సంతృప్తి వ్యక్తం చేశారు. రాబోయే పరీక్షలకూ ఇదే విధంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు కొనసాగుతాయని విద్యాశాఖ అధికారులు తెలిపారు.



టెన్త్ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల సందడి


ఆర్గానిక్ స్టోర్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

# ఆర్గానిక్ స్టోర్ ప్రారంభం

## ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్..

**రామకుప్పం (తెలుగోడు), మార్చి 16 :**
రామకుప్పంలో నూతనంగా ప్రారంభించిన కుప్పం ఆర్గానిక్ స్టోర్ ను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పిఎస్ మణిరత్నం, కూటమి నేతలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయలు, ఇతర ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. భూమిలో ఎక్కువ శాతం ఎరువుల కల్తీతో అనారోగ్యాలు బారిన పడకుండా ఆర్గానిక్ వస్తువులతో ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు వెంకటరమణ, ఉదయ్ కుమార్, ఆంజనేయ రెడ్డి, సీతాపతి,కామరాజు నాయక్, నారాయణ చారి, నర్సింహులు, మహమ్మద్ రఫీ,రవి రెడ్డి, ఆదిల్ ,మంజునాథ్, సాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పాలశీతలీకరణ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

# పాల శీతలీకరణ కేంద్రాల ఆకస్మిక తనిఖీ

**ముద్దనూరు (తెలుగోడు), మార్చి 16 :**
స్థానిక మేజర్ పంచాయతీలో ఉన్న వివిధ పాలశీతలీకరణ కేంద్రాలను పశు వైద్య అధికారి వాసా శ్రీనివాస సోమవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాల సేకరణ దారులతో ఆయన మాట్లాడుతూ పాలను మీ పరిధిలో ఉన్న పరికరాలను ఉపయోగించి సేకరించాలన్నారు. అలాగే పాలను సేకరించేటప్పుడు సేకరించి విధానాలు గురించి వారికి వివరంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్ ఎస్ ఏ సూరిబాబు సిబ్బందితోపాటు పాల సేకరణ యజమానులు ఉన్నారు.


వైసిపి కార్యకర్తలకు కండువా కప్పుతున్న గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్

# 400 మంది వైసిపి కార్యకర్తలు పార్టీలో చేరిక

## శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్..

**గూడూరు (తెలుగోడు), మార్చి 16 :**
శాసన సభ్యులు పాశం సునీల్ కుమార్ సమక్షంలో 400 మంది వైసిపి కార్యకర్తలు టిడిపిలో చేరారు. చిల్లకూరు జ్యోతి కాటా వద్ద వైసిపికి చెందిన తిమ్మనపాలెం సర్పంచ్ గిద్దలూరు సుమలత, కమ్మవారిపాలెం సర్పంచ్ చిట్టేటి నారాయణ, యెరూరు ఎంపీటీసీ చేవూరు మాధవి , మాజీ ఎంపిటిసి చేవూరు నాగరాజుతో పాటు 400 మందికి పెంచలకోన ట్రస్ట్ బోర్డు మాజీ ఛైర్మెన్ తానంకి నానాజీ ఆధ్వర్యంలో పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరే వారు పాత నాయకులతో సమన్వయం చేసుకుని ముందుకెళ్లాలని అన్నారు. పార్టీలో అందరికీ సమూచిత

# తెరుచుకోని సచివాలయాలు..

## ప్రజలకు తప్పని తిప్పలు ..

**టి.సుండుపల్లి (తెలుగోడు), మార్చి 16 :**
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సచివాలయాల నిర్వహణ అగమ్యగోచరంగా ఉంది. కడప జిల్లా టీ సుండుపల్లె మండలంలోని పలు సచివాలయాలు ఉదయం 11 గంటలకు కూడా తెరుచుకోని దుస్థితి నెలకొందని సచివాలయాల్లో వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. సోమవారం సుండుపల్లి మండల కేంద్రానికి కూతవేటు దూరంలోని తిమ్మసముద్రం గ్రామ సచివాలయాలు ఉదయం 11 గంటలకు కూడా తెరుచుకొని దుస్థితి నెలకొని ఉందని, కనీస బాధ్యత కూడా లేకుండా అధికారులు సచివాయాలను నిర్వహించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం నుండి సర్వేల పేరుతొ బయట ఉన్నామన్న సమాధానం అధికారుల నుండి వస్తోందని వాపోయారు.తిమ్మసముద్రం సచివాలయం 10.45 గంటలకు కూడా తాళం తీయని స్థితిలో ఉండటం సచివాలయ వ్యవస్థ నిర్వహణ పట్ల అధికారులకు ఉన్న నిర్లక్ష్యం తెలియచేస్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి.ఇదే ఘటన పట్ల మండల అభివృద్ధి అధికారిని వివరణ కోరగా గ్రామ అధికారులు వివిధ పనులలో


తెరుచుకొని సచివాలయాల వద్ద వేచి చూస్తున్న ప్రజలు

ఉన్నారని, కానీ సచివాలయలు తెరవాల్సిన బాధ్యత ఉందని ఇక ముందు ఇలా జరగకుండా చూస్తామని అన్నారు.

# ప్రశాంతంగా పది పరీక్షలు

## ఏడుగురు గైర్హాజరు..
## పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు..

**టి.సుండుపల్లి (తెలుగోడు), మార్చి 16 :**
టి.సుండుపల్లె మండల కేంద్రంలో 10 పరీక్షలు ప్రశాంతంగా సోమవారం ప్రారంభమయ్యాయని మండల విద్య శాఖ అధికారి వెంకటేష్ నాయక్ తెలిపారు.మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 252 మంది విద్యార్థులకు గాను 251 మంది హాజరవగా ఒకరు గైర్హాజరు అయినట్లు , మడితాడు పంచాయతీ గుట్ట కిందరాచపల్లెలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 222 మంది విద్యార్థులకు గాను 6 మంది గైర్హాజరు అయినట్లు మండల విద్యాశాఖ అధికారి వెంకటేష్ నాయక్ తెలిపారు.పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు సుండుపల్లె ఎస్సై హుస్సేన్


పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్సై హుస్సేన్

తెలిపారు.పోలీసు సిబ్బందితో కట్టదిట్టమైన పర్యవేక్షణను అములు చేశారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థుల సౌకర్యార్థం తాగునీటి ఇతర మౌలిక సదుపాయాలు కల్పించారు.

# ప్రశాంతంగా పది పరీక్షలు

**ముద్దనూరు (తెలుగోడు), మార్చి 16 :**
స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన తొలి రోజు తెలుగు పరిక్షకు మండలం లోని ఐదు ప్రభుత్వ పాఠశాల, మూడు ప్రైవేట్ పాఠశాలల నుండి 297 మంది విద్యార్థులకు గాను 296 మంది విద్యార్థిని,విద్యార్థులు, పరీక్షకు


పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

హాజరు అయినట్లు మండల విద్యాశాఖధికారి నాగేశ్వర నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష కేంద్రం నందు విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మంచినీటి వసతి ఏర్పాటు, అలాగే విద్యార్థులకు పరీక్ష హాలు నందు సౌకర్యవంతంగా బల్లలు, ట్యూబ్ లైట్స్, ఫ్యాన్ లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసుల ఆధ్వర్యంలో పగడ్బందీ గా కాపలా నిర్వహిస్తూ, అలాగే ఒక్కొక్క పరీక్ష కేంద్రం లో ఎటువంటి మాస్ కాపింగ్ కు ఆస్కారం లేకుండా ఒక చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్మెంట్ ఆఫీసర్, 8 మంది ఇన్విజిలేటర్లు, ఇద్దరు సిట్టింగ్ స్క్వాడ్లను నియమించినట్లు పగడ్బందీగా పరీక్షలు జరుపుతున్నట్లు తెలిపారు.


మండల విద్యాశాఖధికారి నాగేశ్వర నాయక్

# బసవేశ్వర స్వామికి వెండి కిరీటం వితరణ


వెండి కిరీటం అలంకరణలో బసవేశ్వర స్వామి

**ముద్దనూరు (తెలుగోడు), మార్చి 16 :**
బొందలకుంటలో వెలసిన అతి పురాతన బసవేశ్వర స్వామికి భక్తుడు మండలం బొందలకుంట జంగం రెడ్డి పల్లె, గ్రామ వాస్తవ్యుడైన కృష్ణ పాటి, సుదర్శన్ రెడ్డి, గురు శ్రీ దంపతులు సోమవారం స్వామివారికి వెండి కిరీటం బహుకరించారు. బొందల కుంటగ్రామంలో వెలసిన అతిపురాతణమైన శ్రీ బసవేశ్వర స్వామి కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా విరాజుల్లుతున్నాడని దీనికి నిదర్శనం అని ఈ పుణ్య దంపతులు ఉదాహరణగా చెప్పవచ్చు, వీరు మొక్కుకున్న కోరికలు తీర్చడంతో స్వామివారికి సంతోషంతో, మనస్ఫూర్తిగా వేడుకొనగా వారి కొరికను తీర్చినందుకు గాను వారు ఆ బసవేశ్వర స్వామి దేవస్థానంకి సుమారు 1 కేజీ 800గ్రాములు (రూ. 1,70,000 విలువ గల) వెండి కిరీటం ను వితరణ చేసి ఆలయ అర్చకులు అనిల్ స్వామి కి అందచేశారు.


బసవేశ్వర స్వామికి వెండి కిరీటం అందిస్తున్న దాతలు


రైతన్న మీ కోసం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

# రైతన్న మీ కోసం పోస్టర్ల ఆవిష్కరణ

## వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి..

**ముద్దనూరు (తెలుగోడు), మార్చి 16 :**
మండల పరిధిలోని కొత్తపల్లె కె తిమ్మాపురం గ్రామాల్లో సోమవారం రైతన్న మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించి సంబంధిత పోస్టర్లను మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతన్న మీ కోసం కార్యక్రమంలో రూపొందించిన పంచ సూత్రాల గురించి వివరించారు. ఎలినినో ప్రభావం గురించి రైతులకు అవగాహన కల్పించి అందుకు తగ్గట్లు ప్రణాళిక చేసుకుని పియండీఎస్ పద్ధతులను పాటించాలని తెలిపారు.తదుపరి యూరియా వాడకం గురించి తెలిపారు.తదుపరి కె తిమ్మాపురం గ్రామంలో రైతన్న మీ కోసం కార్యక్రమంలో పాల్గొని వ్యవసాయ పథకాల గురించి అవగాహన కల్పించారు.పొలం కలిగి ఉన్న ప్రతి రైతు ఎపి యాప్ ఆర్ పోర్టల్ లో రైతు రిజిస్ట్రేషన్ చేసుకుని విశిష్ట గుర్తింపు సంఖ్య ఐడి ని పొందాలి అన్నారు.ఈ కార్యక్రమంలో ప్యాక్స్ సొసైటీ ఛైర్మెన్ ఆర్.సురేంద్ర నాథ్ రెడ్డి,మోహన్ రెడ్డి,గ్రామ సచివాలయ సిబ్బంది సుచరిత, సందీప్,శేఖర్,మాధవి,శివ,పకృతి వ్యవసాయ సిబ్బంది రామసుధ మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.


ఆర్డీవోకి వినతిపత్రం అందించిన బీఎస్పీ నాయకులు

# ఆర్డీవో కార్యాలయం వద్ద తాగునీటి వసతి కల్పించాలి

## బీఎస్పీ నేతల వినతి..

**గూడూరు (తెలుగోడు), మార్చి 16 :**
గూడూరు రెవెన్యూ డివిజనల్ కార్యాలయం వద్ద అర్జీదారులకు తాగునీటి వసతి కల్పించాలని బహుజన్ సమాజ్ పారీ నాయకులు ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. గూడూరు నియోజకవర్గ బీఎస్పీ ఇన్‌చార్జ్ ఎల్.వి. సుబ్బయ్య, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి నాసిన భాస్కర్ గౌడ్, పార్టీ నాయకులు గొర్రిపాటి వెంకటేశ్వర్లు, జి. వెంకటేశ్వరరాజు తదితరులు ఆర్డీవోను కలిసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా బీఎస్పీ గూడూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎల్.వి. సుబ్బయ్య మాట్లాడుతూ గూడూరు ఆర్డీవో కార్యాలయానికి ప్రతి రోజూ వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం వస్తున్నారని తెలిపారు. పేదలు, రైతులు, కార్మికులు, వృద్ధులు, మహిళలు తమ సమస్యలను అధికారులకు తెలియజేయడానికి ఉదయం నుంచే కార్యాలయం వద్దకు వచ్చి గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. అయితే ఇలాంటి పరిస్థితుల్లో కూడా కార్యాలయం వద్ద సరైన తాగునీటి వసతి లేకపోవడం చాలా బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ప్రస్తుతం ఎండలు తీవ్రంగా కాస్తున్నాయని, వేసవి కాలంలో ప్రజలకు తాగునీరు అత్యవసరమని యలె. వి.సుబ్బయ్య పేర్కొన్నారు. కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన నీటి కుండలు శుభ్రంగా లేక దుమ్ము ధూళితో నిండిపోయి ఉండటంతో వాటిలో తాగునీరు అందుబాటులో లేక ప్రజలు దాహంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు తాగునీరు లేక ఇబ్బందులు పడటం బాధాకరమని అన్నారు.అలాగే అర్జీదారుల కోసం ఏర్పాటు చేసిన షెల్టర్ కూడా శుభ్రత లేకుండా దుమ్ముతో నిండిపోయి ఉందని, అక్కడ కూర్చునే ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. కార్యాలయానికి వచ్చే ప్రజలు ప్రభుత్వంపై నమ్మకంతో తమ సమస్యలను చెప్పుకునేందుకు వస్తున్నారని, కనీస సౌకర్యాలైన తాగునీరు, పరిశుభ్రమైన వాతావరణం, బాత్రూం వంటి సదుపాయాలు అందుబాటులో ఉండాలని అన్నారు.

కార్యాలయం వద్ద బాత్రూం సౌకర్యం కూడా అందుబాటులో లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు గంటల తరబడి అక్కడే ఉండాల్సి రావడంతో ఈ సమస్యలు మరింత తీవ్రంగా మారుతున్నాయని అన్నారు. అందువల్ల వెంటనే తాగునీటి వసతి కల్పించి నీటి కుండల్లో శుభ్రమైన మంచినీరు నిల్వ ఉంచేలా చర్యలు తీసుకోవాలని గౌరవ గూడూరు ఆర్డీవోను కోరినట్లు తెలిపారు.ఈ విషయంపై వెంటనే స్పందించిన గూడూరు ఆర్డీవో కార్యాలయం వద్ద తాగునీటి వసతి కల్పించేలా చర్యలు తీసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకొని తక్షణమే స్పందించిన గూడూరు ఆర్డీవోకు బీఎస్పీ పార్టీ తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని యలె. వి సుబ్బయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి నాసిన భాస్కర్ గౌడ్, పార్టీ నాయకులు గొర్రిపాటి వెంకటేశ్వరులు జి. వెంకటేశ్వరరాజు, పలువురు బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


యాగశాలలో పూజలు చేస్తున్న అర్చక స్వాములు . ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

# శ్రీశైలంలో ప్రారంభమైన ఉగాది మహోత్సవాలు

**శ్రీశైలం (తెలుగోడు), మార్చి 16 :**
శ్రీశైల మహా క్షేత్రంలో ఐదురోజులపాటు నిర్వహించే ఉగాది ఉత్సవాలు సోమవారం నాడు ప్రారంభమయ్యాయి . ఉదయం ఆలయ ప్రాంగణంలో ఉత్సవ ప్రారంభ కార్యక్రమాలు ఆగమశాస్త్రానుసారం జరిపించారు. ఈ సందర్భంగా శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషపూజలు నిర్వహించారు.

***యాగశాల ప్రవేశం..***
ఉత్సవ నిర్వహణలో భాగంగా ముందుగా కార్యనిర్వహణాధికారి స్థానాచార్యులు (అధ్యాపక), అర్చకస్వాములు, వేదపండితులు, అధికారులు సంప్రదాయబద్ధంగా ఆలయ ప్రాంగణంలో స్వామివార్ల యాగశాల ప్రవేశం చేశారు.

***వేదస్వస్తి..***
ఆలయప్రవేశం చేసిన వెంటనే వేదపండితులు వేదపారాయణలు చేసి వేదస్వస్తి నిర్వహించారు.

***శివసంకల్పం..***
వేదపఠనం అయిన వెంటనే స్థానాచార్యులు ( అధ్యాపక) , అర్చకస్వాములు, వేదపండితులు, లోకక్షేమాన్నికాంక్షిస్తూ ఉత్సవ సంకల్పాన్ని పఠించారు. దీనికే శివసంకల్పం అని పేరు. ఈ సంకల్పంలో దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించ కుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలని, జనులందరికీ ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు జరగకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన, ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలంటూ ఆలయ అర్చకులు, వేదపండితులు సంకల్పపఠనం చేశారు.

***గణపతి పూజ..***
సంకల్పపఠనం తరువాత ఉత్సవాలు నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజ జరిపించారు.

***పుణ్యాహవచనం..***
గణపతిపూజ తరువాత పుణ్యాహవచనం జరిపించబడింది. వృద్ధి మరియు అభ్యుదయాల కోసం ఈ పుణ్యాహవచనం జరిపించారు.

***చండీశ్వరపూజ..***
సంకల్పపఠనం తరువాత చండీశ్వరపూజ జరిపించబడింది. ఈ ఉత్సవాలు క్షేత్రపాలకుడైన వీరభద్రస్వామి పర్యవేక్షణలో, శివపరివార దేవతలలో ఒకరైన చండీశ్వరుని నాయకత్వంలో నిర్వహించబడుతాయని చెప్పబడుతోంది. అందుకే యాగశాల ప్రవేశం తరువాత చండీశ్వరునికి ప్రత్యేకంగా పూజాదికాలు జరపించడం సంప్రదాయం.

***కంకణ పూజ, కంకణధారణ ..***
చండీశ్వరపూజ తరువాత కంకణాలకు (రక్షాబంధనాలకు) శాస్త్రోక్తంగా పూజాదికాలు జరిపించారు. తరువాత అధికారులు, అర్చకస్వాములు కంకణాలను ధరించారు.

***ఋత్విగ్వరణం..***
కంకణధారణ తరువాత ఋత్విగ్వరణం నిర్వహించారు. ఉత్సవాలలో ఆయా వైదిక కార్యక్రమాలు నిర్వహించమని ఋత్విక్కులను ఆహ్వానిస్తూ వారికి దీక్షావస్త్రాలను అందజేసే కార్యక్రమానికే ఋత్విగ్వరణం అని పేరు.

***అఖండస్థాపన..***
ఋత్విగ్వరణం తరువాత అఖండదీపస్థాపన చేయబడింది. అనంతరం వాస్తుపూజ నిర్వహించారు.

***రుద్రకలశస్థాపన..***
వాస్తు హోమం తరువాత మండపారాధన చేసి ప్రత్యేక కలశస్థాపన చేశారు. కలశస్థాపన తరువాత కలశార్చన జరిపించబడింది. తరువాత పంచావరణార్చనలు నిర్వహించారు.అనంతరం లోకకల్యాణం కోసం జపానుష్ఠానాలు జరిపించారు.

***అంకురార్పణ..***
ఉత్సవాల మొదటిరోజు సాయంకాలం జరిగే అంకురార్పణకు ఎంతో విశేషముంది. ఈ కార్యక్రమములో ఆలయ ప్రాంగణంలోని నిర్ణీత పునీత ప్రదేశములోని మట్టిని సేకరించి యాగశాలకు తీసుకువస్తారు. దీనినే "మృత్సంగ్రహణం" అంటారు. తరువాత ఈ మట్టిని తొమ్మిది పాలికలలో (మూకుళ్ళలో) నింపి, దాంట్లో నవధాన్యాలను పోసి, ఆ మట్టిలో మొలకెత్తించే పనిని ప్రారంభిస్తారు. ఈ అంకురారోపణ కార్యక్రమానికి చంద్రుడు అధిపతి, శుక్లపక్ష చంద్రునివలే పాలికలలోని నవధ్యాన్యాలు సైతం దినదినాభివృద్ధి చెందాలని ప్రార్థిస్తారు. పాలికలలో రోజూ నీరు పోసి నవధాన్యాలు పచ్చగా మొలకెత్తేలా చూస్తారు. అలంకారాలను ఆరోపింపజేసే కార్యక్రమం కాబట్టే దీనికి అంకురార్పణ అని పేరు. ఈ ప్రారంభ పూజా కార్యక్రమములో కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు, అర్చకస్వాములు, వేదపండితులు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

***భృంగివాహనసేవ..***
ఈ ఉత్సవాలలో భాగంగానే సాయంకాలం స్వామిఅమ్మవార్లకు భృంగివాహనసేవ నిర్వహించారు. ఈ సేవలో శ్రీ స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను భృంగివాహనసేవపై వేంచేబు చేయించి విశేషంగా అలంకార మండపములో పూజాదికాలు జరిపించిన తరువాత గ్రామోత్సవం నిర్వహించారు. భృంగివాహనాధీశులైన శ్రీస్వామిఅమ్మవార్లను దర్శించడం వలన పనులలో ఏకాగ్రత లభిస్తుందని, పాపాలు హరించబడుతాయని చెప్పబడుతోంది

***మహాలక్ష్మీ అలంకారం..***
ఉత్సవాలలో భాగంగా అమ్మవారి ఉత్సవమూర్తికి మహాలక్ష్మీ అలంకారం: గ్రామోత్సవం నిర్వహించారు. చతుర్భుజాలు గల ఈ దేవిపై రెండు చేతులలో పద్మాలను, క్రింది చేతులలో కుడివైపున అభయ హస్తం, ఎడమ వైపు వరముద్రతో దర్శనం ఇవ్వనున్నారు.

మహాలక్ష్మీ స్వరూపాన్ని దర్శించడం వలన శత్రుబాధలు నివారించబడి, సకల శుభాలు కలుగుతాయని చెప్పబడుతోంది.అదే విధంగా గ్రామోత్సవంలో నాదస్వరం, కోలాటం, చెక్కభజన, రాజభటులవేషాలు, కేరళ చండీమేళం, కొమ్ముకొయ్య నృత్యం, ముంభాయ్ డోల్ థేష్, విళక్కు, స్వాగత నృత్యం, వీరభద్ర డోలు కుణిత, జాంజ్ పథక్ (కర్ణాటక డోలు) కాళికా నృత్యం, జానపద పగటి వేషాలు, నందికోలు సేవ, గౌరవనృత్యం, తప్పెటచిందు, బీరప్పడోలు, నందికోలసేవ, ఢమరుకం, చిడతలు, శంఖం, పిల్లనగ్రోవి, డోలు విన్యాసం, గిరిజన చెంచు నృత్యం తదితర కళారూపాలు గ్రామోత్సవంలో ఏర్పాటు చేయబడ్డాయి కార్యక్రమంలో ఆలయ అధికారులు అర్చక వేద పండితులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


గ్రామోత్సవంలో పాల్గొన్న కార్యనిర్వహణాధికారి దంపతులు . అర్చకులు



రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై సోమశేఖర్

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి రూ.10 వేల జరిమానా

**రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన ..**
**హెల్మెట్ తప్పనిసరి. ఎస్సై సోమశేఖర్ ..**

**బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 16 :**
మద్యం సేవించి వాహనం నడిపిన ఇద్దరికి ధర్మవరం కోర్టు రూ.10 వేల చొప్పున జరిమానా విధించింది. వాహనాల తనిఖీల్లో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తూ పట్టుబడిన ఇద్దరిపై పోలీసులు కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు బత్తలపల్లి ఎస్సై సోమశేఖర్ తెలిపారు.శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు, ధర్మవరం డీఎస్పీ,రూరల్ సీఐల సూచనలతో మండలంలో పోలీసులు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజలకు మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.ప్రమాదాల్లో కుటుంబానికి అండగా ఉండే వ్యక్తి ప్రాణాలు కోల్పోతే ఆ కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఎస్సై తెలిపారు. వాహనాల తనిఖీల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తూ పట్టుబడిన ఇద్దరిపై కేసులు నమోదు చేసి ధర్మవరం కోర్టుకు పంపగా, కేసును విచారించిన మెజిస్ట్రేట్ ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు.మండల ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, మద్యం సేవించి లేదా హెల్మెట్ లేకుండా వాహనాలు నడపరాదని ఎస్సై సోమశేఖర్ సూచించారు.

# రైతన్న మీ కోసం. వారోత్సవాలు

**పంచ సూత్రాలు, ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై పూర్తి అవగాహన ..**

**రొళ్ల (తెలుగోడు), మార్చి 16 :**
రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 16,17,18 23, 24,25 తేదీల్లో 'రైతన్న మీ కోసం' కార్యక్రమాన్ని మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో నిర్వహిస్తున్నట్లు ఎఓ వెంకటబ్రహ్మం తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం మండలంలోని గిద్దబొమ్మనపల్లి గ్రామం లో ఈకార్యక్రమాన్ని ప్రారంభించారు.అన్ని రైతు సేవా కేంద్రాలలో నిర్దేశించిన కమిటీ సభ్యుల ద్వారా ఇంటింటా తిరిగి ముఖ్యమంత్రి ఇచ్చిన లేఖను ఇస్తూ అదే విధంగా ఆ లేఖలో ఉన్న నీటి భద్రత,డిమాండ్ ఆధారిత పంటలు సాగు, వ్యవసాయంలో సాంకేతికత ఆహార శుద్ధి,ప్రభుత్వ మద్దతు– రైతులకు పెట్టుబడి సాయంగా అన్నదాతా సుఖీభవ – పీఎం కిసాన్ పథకం కింద మూడు విడతల్లో ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున అర్హత ఉన్న రైతు కుటుంబాలకు ఇవ్వడం జరిగిందని తెలియజేసారు. ప్రభుత్వం నుంచి రైతులు లబ్ధి పొందుతున్న వివిధ రకాల పథకాలు, ప్రభుత్వం అందిస్తున్నటువంటి ప్రోత్సాహకాలు గురించి, ఎల్ నినో,మిడిల్ ఈస్ట్ వార్ ప్రభావం గురించి తెలియజేశారు. వాతావరణ పరిస్థితులు, మారుతున్న కాలానికి అనుగుణంగా డిమాండ్ ఆధారిత పంటలను ప్రకృతి వ్యవసాయం పద్ధతులు వాడుతూ రసాయనాల వాడకాన్ని తగ్గించి వివిధ రకాల పంటలు సాగు చేయాలని ముఖ్యంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులైన ప్రీ మన్సూన్ డ్రై సోయింగ్, పెల్లెటైజేషన్, డ్రాట్ ప్రూఫ్ మోడల్, హాఫ్ మూన్ మోడల్, ఏటీఎం,ఏ గ్రేడ్ మోడల్స్ లలో ఘన,ద్రవ బీజామృతాలు, కషాయాలు వాడాలని, చిరుధాన్యాలు, మల్బరీ, ఉద్యానవన పంటలు, పాడి చేపట్టాలని అలాగే నూతన టెక్నాలజీలో భాగంగా ఫార్మర్ ఐడి, ఈ పంట ఫార్మర్ ఈ కేవైసి చేసి,ఏపీ ఎయిమ్స్ రైతు యాప్ ఇన్స్టాల్ చేస్తూ,కిసాన్ డ్రోన్, డ్రిప్, స్ప్రింకలర్స్ గురించి తెలిపి ఇంటింటి సర్వేలో పాల్గొన్న రైతులు వివరాలు కూడా రైతన్న మీకోసం యాప్లో అప్లోడ్ చేయడం జరుగుతుంది అని మండల వ్యవసాయ అధికారి వెంకటబ్రహ్మం తెలిపారు.ఈ కార్యక్రమంలో రైతులు, పాల్గొన్నారు.



రైతన్న మీ కోసం కరపత్రాలను ప్రదర్శిస్తున్న దృశ్యం

# వేగం కాదు.. ప్రాణమే విలువైంది

**మడకశిరలో రోడ్డు భద్రత,**
**డ్రగ్స్‌పై భారీ అవగాహన సదస్సు..**
**హెల్మెట్ లేకపోవడంతో**
**ఏడాదిలోనే 180 మంది మృతి..**
**జీవితాలను నాశనం చేసి**
**మత్తుపదార్థాల జోలికి వెళ్ళద్దు..**
**ఎస్పీ సతీష్ కుమార్,**
**ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు..**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్

**మడకశిర (తెలుగోడు), మార్చి 16 :**
మడకశిర పట్టణంలో రోడ్డు ప్రమాదాల నివారణ, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఐపీఎస్, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, సినీ నటుడు శ్రీ విష్ణు, నటీమణులు అనన్య, హెబ్బా పటేల్, భారత అంధ క్రికెట్ జట్టు కెప్టెన్ దీపిక ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. యువత, వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలు, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల విషయంలో రాష్ట్రం తొమ్మిదో స్థానంలో ఉందని తెలిపారు. వేగం కన్నా క్షేమం ముఖ్యమని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, అతివేగం వంటి నిర్లక్ష్యాల వల్ల అనేక కుటుంబాలు విషాదంలో మునిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనం నడిపే ప్రతి ఒక్కరు తమపై ఒక కుటుంబం ఆధారపడి ఉందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు.
జిల్లాలో గత సంవత్సరం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 275 మంది మృతి చెందారని తెలిపారు. అందులో 180 మంది హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. హెల్మెట్ ఒక రక్షణ కవచమని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పిలుపునిచ్చారు. సీట్ బెల్ట్, హెల్మెట్ వినియోగంపై ప్రజల్లో మరింత అవగాహన పెంచేందుకు పోలీసు శాఖ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. హెల్మెట్ ధరించకుండా వాహనం నడిపే వారిని గుర్తించి 750 రూపాయలు తీసుకుని నాణ్యమైన హెల్మెట్ అందజేసి భద్రతా సూచనలు ఇస్తున్నట్లు వెల్లడించారు. తరువాత కూడా హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే ప్రతిసారి వెయ్యి రూపాయల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. భవిష్యత్తులో రోడ్డు ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.
మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని ఎస్పీ హెచ్చరించారు. గంజాయి, డ్రగ్స్ వాడకం వల్ల కుటుంబాల్లో కలహాలు, సమాజంలో అవమానం ఎదురవుతాయని చెప్పారు. మాదకద్రవ్యాలు అమ్మడం, వాడటం చట్టరీత్యా నేరమని, నేరం రుజువైతే పది నుంచి ఇరవై సంవత్సరాల వరకు శిక్ష విధించే అవకాశం ఉందని తెలిపారు. జిల్లాలో డ్రగ్స్ నిర్మూలన లక్ష్యంగా ఇప్పటికే అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎవరైనా గంజాయి లేదా డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు తెలిసినా టోల్ ఫ్రీ నంబర్లకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.



మడకశిర పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో తన సొంత తమ్ముడు మృతి చెందడం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. అందుకే యువత, ప్రజల్లో అవగాహన పెంచేందుకు సినీ ప్రముఖులతో కలిసి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించడం, గంజాయి వంటి మత్తు పదార్థాలను పూర్తిగా నిర్మూలించడం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించడంతో పాటు మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, సీఐలు రాజ్ కుమార్, సుబ్రహ్మణ్యం, మడకశిర ప్రాంత ప్రజలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పరీక్షా కేంద్రాలను సందర్శించిన మండల అధికారులు

# సజావుగా 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు

**అగళి (తెలుగోడు), మార్చి 16 :**
అగళి మండలంలో సోమవారం ప్రారంభమైన 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు మొదటి రోజు సజావుగా జరిగాయని తహసిల్దార్ సుబ్బారావు తెలిపారు. మధూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, స్థానిక కేజీబీవీ సెంటర్లో ప్రభుత్వ ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. వివిధ పాఠశాలల నుంచి పదవ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా మొదటిరోజు సోమవారం తెలుగు పరీక్షకు మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పరీక్ష ప్రారంభ సమయానికి ముందే చేరుకొని పరీక్షా కేంద్రాల వద్ద హడావుడి జరిగింది. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకుని వచ్చి పరీక్షా కేంద్రాలలో వదిలారు. ఎట్టకేలకు తెలుగు పరీక్ష ప్రశాంతంగా సజావుగా జరిగింది. పరీక్ష కేంద్రాల వద్ద ఏఎస్ఐ తన సిబ్బందితో ఘట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తహసిల్దార్ సుబ్బారావు తో పాటు వీఆర్వో దొడ్డేగౌడ్, ఎంపీడీవో, డిప్యూటీ ఎంపిడిఓ రెడ్డి ప్రకాష్, మండల విద్యాధికారి, హెల్త్ సిబ్బంది సుబ్బయ్య, ఆశా కార్యకర్త,పోలీస్అధికారులు, తదితరులు పాల్గొన్నారు



శరవేగంగా సాగుతున్న పాఠశాల భవనాల నిర్మాణం పనులు

# శాన్వి పాఠశాలలో వేగంగా భవన నిర్మాణం పనులు

**రొళ్ల (తెలుగోడు), మార్చి 16 :**
రోళ్ల నుంచి మడకశిర వైపు వెళ్లే జాతీయ ప్రధాన రహదారి పక్కన నిర్మిస్తున్న శాన్వి పాఠశాల భవనపు నిర్మాణపు పనులు వేగంగా జరుగుతున్నాయి. గత విద్యా సంవత్సరమే గ్రౌండ్ ఫ్లోర్ భవనాలను పూర్తి చేసి పాఠశాలను ప్రారంభించిన విషయం తెలిసిందే. మొదటి ఫ్లోర్ నిర్మాణం పనులను ప్రారంభించి త్వరిత గతినా నిర్మాణం పూర్తి చేయాలన్నా సంకల్పంతో పాఠశాల యాజమాన్యం శరవేగంగా పనులు చేయిస్తున్నారు.కింద 11 గదులు మొదటి అంతస్తు లో మరో 11 గదులతో నిర్మాణం చేపట్టుతున్నారు.మొత్తం 22 గదులతో 2026-27 విద్యా సంవత్సరంలో విద్యార్థులకు సౌలభ్యకరంగా పాఠశాల నిర్వహణ కు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం మారుతున్న కాలనుగుణంగా ఆధునిక పద్ధతులతో విద్యాబోధనను అందిచడమే తమ ముందున్న ఏకైక లక్ష్యమని పాఠశాల కరెస్పాండంట్ రూప పాఠశాల డైరెక్టర్ చిత్తయ్య తెలిపారు.

# హనుమాన్ విజయ యాత్ర బైక్ ర్యాలీకి విస్తృత ప్రచారం

**తాడిపత్రి (తెలుగోడు), మార్చి 16 :**
జైశ్రీరామ్ భక్త మండలి ఆధ్వర్యంలో ఏప్రిల్ 2న నిర్వహించనున్న హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ విజయ యాత్ర మోటార్ బైక్ ర్యాలీకి సంబంధించిన ప్రచార కార్యక్రమాలు సోమవారం పట్టణంలో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జైశ్రీరామ్ భక్త మండలి అధ్యక్షుడు నిచ్చెనమెట్ల రాధాకృష్ణ పలువురు ప్రముఖులను, భక్తులను కలిసి ర్యాలీలో పాల్గొనాలని కోరుతూ ఆహ్వాన పత్రికలను అందజేశారు. అనంతరం పట్టణంలోని సీబీ రోడ్ ప్రాంతంలో ఆటోలకు ప్రత్యేకంగా తయారు చేసిన స్టిక్కర్లను అతికించి, ప్రజలకు కార్యక్రమ వివరాలను తెలియజేశారు.



బైక్ ర్యాలీ స్టిక్కర్లను ఆటోలకు అతికిస్తున్న దృశ్యం



ఆహ్వాన పత్రికను అందజేస్తున్న దృశ్యం

అదేవిధంగా హనుమాన్ జయంతి వేడుకల ప్రాముఖ్యతను తెలియజేస్తూ పోస్టర్లు, కాషాయ జెండాలను పంపిణీ చేసి భక్తులను భారీ సంఖ్యలో పాల్గొనాలని కోరారు.
రాబోయే రోజుల్లో పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించనున్నట్లు నిచ్చెనమెట్ల రాధాకృష్ణ తెలిపారు. హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించే ఈ హనుమాన్ విజయ యాత్ర బైక్ ర్యాలీను భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు భారీగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగాధర్, నారాయణ స్వామి, మల్లి, ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు

**రొళ్ల (తెలుగోడు), మార్చి 16 :**
స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం పొట్టి శ్రీ రాములు జయంతి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమములో తహాశీల్దారు శ్రీ కె ఆర్ చంద్రశేఖర్ ఆర్ ఐ గిరియప్ప, జూనియర్ అసిస్టెంట్ రఫిక్,వీఆర్వో లు ఆఫీసు సిబ్బంది తదితపొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి పూజలు నిర్వహించిన దృశ్యంరులు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి పూజలు నిర్వహించిన దృశ్యం

# డ్రగ్స్ వాడడం కుటుంబ సభ్యుల మనుగడ కోల్పోవడమే

**హెల్మెట్ వాడకపోవడం ప్రాణాంతకం..**
**ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు..**
**మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ..**

**అగళి (తెలుగోడు), మార్చి 16 :**
డ్రగ్స్ వాడడం వల్ల కలిగే దుష్పరిణామాల గురించి అవగాహన కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. మడకశిర పట్టణం అమరాపురం బస్టాండ్‌లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో డ్రగ్స్ వాడకం వల్ల జరిగే దుష్పరిణామాలు , ద్విచక్ర వాహనంలో చోధకులు హెల్మెట్ తప్పకుండా వాడాలని హెల్మెట్ వాడకుండా ఉండడం వల్ల కలిగే ప్రాణ నష్టాల గురించి అవగాహన కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, సినీ ప్రముఖ హీరో శ్రీ విష్ణు,సినీ నటి హెబ్బా పటేల్,అనన్య, ప్రముఖ కమెడియన్ రఘు,ఇండియన్ బ్లైండ్ క్రికెట్ కెప్టెన్ దీపిక పాల్గొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశంలో గంజాయి నిర్మూలన ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడకుండా ఉండడం వల్ల జరిగే నష్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు

యువత డ్రగ్స్ కు అలవాటు పడకుండా ఉండాలని ఒక్కసారి డ్రగ్స్ వాడడం వల్ల వాళ్ళ జీవి తకాలం మొత్తం బానిసై ఉండాలి దానివల్ల వాళ్ళ కుటుంబ సభ్యుల మనుగడ కోల్పోవాల్సి వస్తుందని అసాంఘిక కార్యకలాపాలకు యువత ప్రజలు దూరంగా ఉండాలని సూచించారు, ద్విచక్ర వాహనదారులు అతివేగం మంచిది కాదని ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని హెల్మెట్ వల్ల వారి ప్రాణాలను కాపాడుకోవాల్సి వస్తుందని హెల్మెట్ లేని ప్రయాణం చాలా ప్రమాదమని ప్రాణాలు కోల్పోతే వారి కుటుంబ భవిష్యత్తు కోల్పోవాల్సి వస్తుందని సూచించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రజలందరూ డ్రగ్స్ వాడకం వల్ల జరిగే దుష్పరిణామాల గురించి, హెల్మెట్ వాడకుండా ఉండడం వల్ల జరిగే ప్రమాదాల గురించి ప్రజలలో పెద్ద ఎత్తున తీసుకొని వెళ్లి రాష్ట్రంలో సత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గం ప్రథమ స్థానాల్లో నిలవాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల కమిషనర్ నెంబర్ శ్రీనివాస్ మూర్తి రాష్ట్ర కుంచిటిగా ఒక్కలిగా కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ ఛైర్మన్ నరసింహ రాజు, మార్కెట్ రేట్ ఛైర్మన్ గురుమూర్తి, పట్టణ మరియు మండల కన్వీనర్లు సింగల్ విండో అధ్యక్షులు క్లస్టర్ ఇంచార్జిలు కూటమి నాయకులు అన్ని అనుబంధ కమిటీ నాయకులు ప్రజా ప్రతినిధులు ప్రజలు పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అంధ మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ దీపిక

# శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి హుండీ ఆదాయం లెక్కింపు

**కదిరి (తెలుగోడు), మార్చి 16 :**
కదిరి శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం హుండీల లెక్కింపు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. 35 రోజులకు మొత్తం నగదు రూ.1,15,10,416 వచ్చింది. 2 గ్రాముల బంగారం, 305 గ్రాముల వెండి వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వెండిదండి శ్రీనివాసరెడ్డి తెలిపారు. హుండీ లెక్కింపు పర్యవేక్షణాధికారిగా జిల్లా దేవాదాయశాఖ కార్యాలయం సీనియర్ సహాయకులు వెంకటేశ్వర్లు హాజరయ్యారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది, గ్రామీణ బ్యాంకు యం.జి.రోడ్డు బ్రాంచ్ మేనేజర్, బి.రామక్రిష్ణరెడ్డి, సిబ్బంది, వివిధ సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు

**తొలిరోజు ఇద్దరు విద్యార్థులు గైర్హాజరు..**
**కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు..**

**బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 16 :**
మండల కేంద్రంలో పదవ తరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. స్థానిక బాలికల, బాలుర ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు తొలిరోజు పరీక్షకు హాజరయ్యారు. బాలుర ఉన్నత పాఠశాల కేంద్రంలో కేటాయించిన



బోర్డులో ఏర్పాటుచేసిన రూమ్ నెంబర్లను పరిశీలిస్తున్న విద్యార్థులు



బాలుర ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రానికి తరలివచ్చిన విద్యార్థులు

175 మంది విద్యార్థులూ హాజరుకాగా, బాలికల ఉన్నత పాఠశాల కేంద్రంలో 220 మందికి గాను 218 మంది హాజరయ్యారని, ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్లు నాగరత్నమ్మ, జయంతి వెల్లడించారు.?పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించిన అధికారులు విద్యార్థులకు కల్పించిన వసతులను పరిశీలించారు. గదుల్లో వెలుతురు, త్రాగునీరు, బెంచీలు మరియు వైద్య సదుపాయాల గురించి ఆరా తీశారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై సోమశేఖర్ ఆధ్వర్యంలో 144 సెక్షన్ అమలు చేస్తూ భారీ బందోబస్తు నిర్వహించారు.

# టిక్కెట్ రేట్లపై పవన్ కామెంట్స్



ఉస్తాద్ భగత్ సింగ్' ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో, పవన్ కళ్యాణ్ టికెట్ రేట్ల పెంపుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. 'సినిమాని తెలుగు ప్రేక్షకుల నుంచి గానీ, భారతదేశం నుంచి గానీ దూరం చేయలేము. ఎంటర్‌టైనెన్ట్ ఈజ్ ద సోల్ ఆఫ్ దిస్ నేషన్. అది మన సంస్కృతులకు మూలం. అందుకని ఈ సినిమాని మన జీవితాల్లో నుంచి తీసేయలేము. అలాగే, నాకు ఎప్పుడూ ఏ హీరో విజయం మీద ఇన్సెక్యూరిటీ ఉండదు. అందరూ బాగుండాలని కోరుకుంటాను.సినిమా ఈజ్ నాట్ ఏ కంపల్సరీ. ఏమన్నా గన్ పాయింట్‌లో పెట్టి మీరు చూడాలి అనుకోము కదా. మనకు ఛాయిస్ ఉంది, ఈ రోజున అమెజాన్ కావచ్చు, మల్టిపుల్ ఓటీటీ ప్లాట్‌ఫార్మ్స్ ఉన్నాయి. ఫస్ట్ డే వెళ్లి చూడాలనుకోవడంలో, వీళ్లు ఇంత ఖర్చు పెట్టి ఉంటారు కాబట్టి అడుగుతుంటారు. నా సినిమాలకి నేను ఇంకా తక్కువ రేట్లు ఇచ్చుకున్నాను, కానీ మిగతా హీరోల సినిమాలకి నేను ఎక్కువ రేట్లు ఇప్పించాను. టికెట్ రేట్లు పెంచమని నా దగ్గరికి వస్తారు. అసలు నాకు సంబంధం లేదు. నేను ఏదైనా ఉంటే ఒకటే అడుగుతాను.. ఆంధ్రప్రదేశ్‌కి ఏదైనా సినిమాలు వచ్చి మిగతా హీరోలు, నిర్మాతలు వచ్చినప్పుడు నేను ఒకటే అడుగుతాను: 'మీరు ఎవ్వరినీ దేహి అనకండి'.దయచేసి మీరు దేహి అనద్దు. మీరు ఎంత కష్టపడి తీస్తారో నాకు తెలుసు. పైగా మీరు పెంచిన ప్రతి రూపాయిలో 18శాతం జీఎస్టీకి వెళ్తది. వదిలేస్తే ఎవరో బ్లాక్‌లో టికెట్లు అమ్ముకొని మళ్ళీ అది క్యాష్‌గా వెళ్ళిపోద్ది. అది గవర్నమెంట్‌కి రెవెన్యూ కాదు, ఎవరికీ కాదు. దీన్ని బేస్ చేసుకొని.. నేను ఆంధ్రప్రదేశ్‌కి, ప్రత్యేకించి అది ఎన్డీఏ ప్రభుత్వం కాబట్టి నేను మనస్ఫూర్తిగా, ఇర్రెస్పెక్టివ్ ఆఫ్ హీరో.. అది 'పుష్ప' కావచ్చు, లేదంటే మన జూనియర్ ఎన్టీఆర్ గారు కావచ్చు, మహేష్ గారిది కావచ్చు (మహేష్ గారి సినిమా రిలీజ్ అయిందో లేదో తెలియదు కానీ నాకు ఈ మధ్య కాలంలో), ఏ సినిమా వచ్చినా గానీ, ఇంక్లూడింగ్ 'కల్కి' ప్రభాస్ గారు కావచ్చు, ఇంక్లూడింగ్ మన 'కాంతార' కూడా. కర్ణాటకలో తెలుగు సినిమా పోస్టర్లు కూడా పడకూడదు అని అన్నా గానీ, నేను 'కాంతార'కి ఆ వివక్ష చూపించలేదు. అసలు మనది భారతదేశపు సినిమా, ఇది ఎక్కడైనా ఆడాలి. ఇది మన ఒక్కరిది కాదు, మనందరం బాగుండాలని నేను కోరుకుంటాను' అని పవన్ కళ్యాణ్ చెప్పుకొచ్చారు.

# ఆస్కార్‌లో మెరిసిన ఈషా అంబానీ

సినీ రంగ ప్రతిష్టాత్మక వేడుక 'ఆస్కార్ 2026' అట్టహాసంగా జరిగింది. ఈ వేడుకలో ప్రముఖ పారిశ్రామికవేత్త, రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ తనయ ఈషా అంబానీ సందడి చేశారు. వింటేజ్ వాలెంటినో గౌన్‌లో రెడ్ కార్పెట్‌పై మెరిశారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి.తన భర్త ఆనంద్ పిరమాల్‌తో కలిసి ఈషా అంబానీ ఆస్కార్ వేడుకకు హాజరయ్యారు. ఈషా ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ ఈవెంట్‌కు ముందు ఈషా అంబానీ అకాడమీ మ్యూజియం ఆఫ్ మోషన్ పిక్చర్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఈ మ్యూజియంతో నీతా ముకేశ్ అంబానీ కల్చర్ సెంటర్ కలిసి పనిచేసే అంశాన్ని ఆమె చర్చించినట్లు సమాచారం. భారతీయ సంస్కృతిని అంతర్జాతీయ వేదికపై ప్రతిబింబించడంతో పాటు ఇండియన్ సినిమాకు మరింత గుర్తింపు తీసుకురావడమే లక్ష్యంగా ఈషా అంబానీ ఈ వేడుకలో పాల్గొన్నారు. ఆస్కార్ అవార్డుల కార్యక్రమంలో ఈషా పాల్గొనడం ఇదే తొలిసారి. ఆ మధ్య ఈమె మెట్ గాలాలో సందడి చేసిన సంగతి తెలిసిందే




# ఆస్కార్‌లో ధర్మేంద్ర, కోటలకు నివాళి



అద్భుతమైన నటనతో కోట్ల మంది అభిమానులను సొంతం చేసుకొని.. గతేడాదిలో తుదిశ్వాస విడిచిన నటీనటులకు ఆస్కార్ నివాళులర్పించింది. లాస్ ఏంజెలెస్‌లో జరిగిన 98వ ఆస్కార్ అవార్డుల వేడుకలో ప్రపంచవ్యాప్తంగా సినీరంగం కోసం కృషి చేసిన గొప్ప కళాకారులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా హాలీవుడ్ ప్రముఖులతో పాటు భారతీయ సినిమా నుంచి ధర్మేంద్ర, మనోజ్ కుమార్, బి.సరోజాదేవి, కోట శ్రీనివాసరావు వంటి దిగ్గజాల పేర్లను అకాడమీ తన అధికారిక వెబ్‌సైట్‌లో ప్రత్యేకంగా పొందుపరిచింది. ఆస్కార్ వేడుక ప్రారంభంలో గతేడాది మరణించిన హాలీవుడ్ ప్రముఖులకు నివాళులర్పిస్తూ వీడియోను ప్రదర్శించారు. వారిని స్మరించుకుంటూ వారితో ఉన్న జ్ఞాపకాల గురించి కొందరు వేదికపై మాట్లాడారు. అయితే, ఆ వీడియోలో ధర్మేంద్రను చూపించకపోవడంతో అభిమానులు అసహనం వ్యక్తంచేస్తూ ఎక్స్ వేదికగా పోస్టులు పెట్టారు. సమయాభావం వల్ల వీడియోలో కొందరినే చూపారని.. ఆ తర్వాత అందరి పేర్లను అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచారని హాలీవుడ్ మీడియా పేర్కొంది. 89 ఏళ్ల వయసులో గతేడాది నవంబర్ 24న ధర్మేంద్ర తుదిశ్వాస విడిచారు. సినీ పరిశ్రమకు ఆయన చేసిన సేవలను గుర్తించిన కేంద్రం పద్మ విభూషణ్‌తో సత్కరించింది. ఇక 40 ఏళ్ల సుదీర్ఘ సినీ కెరీర్ కలిగిన కోట శ్రీనివాసరావు గతేడాది జులై 13న మరణించిన విషయం తెలిసిందే.



# ఉస్తాద్‌లో..తొలిప్రేమనాటి పాట రీమిక్స్

పవన్ కల్యాణ్ కెరీర్‌లో ల్యాండ్ మార్క్ మూవీ తొలిప్రేమ. ఈ సినిమాలోని ప్రతీ సీన్ కూడా మూవీ లవర్స్‌కు ఎప్పటికీ గుర్తుండిపోతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇక పాటలైతే సూపర్ హిట్ అల్బమ్స్‌లో ఒకటిగా నిలిచిపోతాయి. ఇప్పటికీ మ్యూజిక్ లవర్స్ ఈ సాంగ్స్‌ను చాలా ఫ్రెష్‌గా తెగ ఎంజాయ్ చేస్తుంటారు. పవన్ కల్యాణ్ టైటిల్ రోల్‌లో నటించిన ఉస్తాద్ భగత్ సింగ్ మార్చి 19న ఉగాది కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతుందని తెలిసిందే. ఉస్తాద్ భగత్ సింగ్‌లో మళ్లీ తొలి ప్రేమలోని ఈ మనసే సాంగ్‌ను రీక్రియేట్ చేసినట్టు పవన్ కల్యాణ్ అభిమానులకు సర్‌ప్రైజ్ అప్‌డేట్ అందించాడు. ఈ సాంగ్ పవన్ కల్యాణ్, శ్రీలీలపై ఉండబోతుండగా.. అభిమానులు, మూవీ లవర్స్‌ను ఎక్జయిటింగ్‌కు లోను చేస్తుంది ఉస్తాద్ భగత్ సింగ్‌గా మాస్ అప్పీల్‌లో కనిపించబోయే పవన్ కల్యాణ్.. మరోసారి తొలిప్రేమలో లవర్‌బాయ్‌లా ఎలా కనిపిస్తాడోనంటూ ఆసక్తిగా చర్చించుకుంటున్నారు అభిమానులు. ఇక రీక్రియేట్ చేయబోతున్న పాటలో శ్రీలీల తొలిప్రేమ హీరోయిన్ కీర్తిరెడ్డిని మరిచిపోయేలా చేస్తుందో లేదో చూడాలి.

# వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్ ఆస్కార్‌లు పండించిన మూవీ ఏకంగా ఆరు ఆస్కార్‌లు ప్రదానం

కథలో బలం, పాత్రల మధ్య సంఘర్షణ ఉండాలే గానీ.. బాక్సాఫీసు లెక్కలతో పని లేకున్నా పురస్కారాల పంట పండుతుందని వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్ సినిమా నిరూపించింది. సినీ రంగం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే అకాడమీ అవార్డుల్లో ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా ఆరు 'ఆస్కార్ లు అందుకుంది. బిడ్డ నమ్మకం గెలుచుకోవడం కోసం ఓ తండ్రి పడే తపనను హృద్యంగా తీర్చిదిద్ది ఉత్తమ దర్శకుడిగానూ అవార్డు అందుకున్నారు పాల్ థామస్ అండర్సన్. బ్లాక్ కామెడీ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన చిత్రంలో లియోనార్డో డికాప్రియో కీలక పాత్ర పోషించారు. విప్లవకారుల గ్రూప్ ఫ్రెంచ్ 75లో సభ్యులైన ప్యాట్ కల్హౌన్ (లియోనార్డో డికాప్రియో), పెర్ఫిడియా బేవర్లీ హిల్స్ (టియానా టేలర్) సహజీవనంలో ఉంటారు. ఓ నిర్బంధ కేంద్రం నుంచి వలసదారులను విడిపించే క్రమంలో అక్కడి కమాండింగ్ అధికారి స్టీవెన్‌ను పెర్ఫిడియా అవమానిస్తుంది. దీంతో వీరిద్దరిపైనా అతడు పగ పెంచుకుంటాడు. ఆ తర్వాత ఓ కేసులో ఆమెను పట్టుకున్న స్టీవెన్.. తనతో ఏకాంతంగా గడిపితే విడిచిపెడతానని షరతు పెడతాడు. ఇందుకు పెర్ఫిడియా అంగీకరిస్తుంది. కొంతకాలానికి ఆమె బిడ్డకు జన్మిస్తుంది. కానీ, ఆ చిన్నారిని, తన భాగస్వామి ప్యాట్‌ను వదిలేసి మళ్లీ విప్లవం బాట పడుతుంది. ఈ క్రమంలోనే స్టీవెన్ సాయంతో మెక్సికోకు వెళ్లిపోతుంది. దీంతో ప్యాట్ ఒంటరి తండ్రిగా చిన్నారి చార్లీన్‌ను పెంచుతాడు. ఈ క్రమంలో వారికి ఎన్నో అవమానాలు ఎదురవుతాయి. మరోవైపు.. అవినీతి అధికారి అయిన స్టీవెన్ అమెరికా సెక్యూరిటీ ఏజెన్సీస్‌లో అగ్రస్థాయికి ఎదుగుతాడు. 16ఏళ్ల తర్వాత పెర్ఫిడియా జన్మనిచ్చిన చిన్నారికి తానే అసలైన తండ్రినని తెలుసుకున్న స్టీవెన్.. ఆమెను చంపేందుకు కుట్రలు పన్నుతాడు. ఈ విషయం తెలుసుకున్న ప్యాట్ అలియాస్ బాబ్.. ఇన్నాళ్లూ సొంతబిడ్డగా పెంచుకున్న చార్లీన్‌ను కాపాడేందుకు ఏం చేస్తాడు? ఆ పోరాటంలో అతని ఆలోచనలు, సంబంధాలు, నైతిక విలువలు ఎలా మారతాయి? స్వార్థం తన పరిస్థితులను ఎలా మార్చేసింది? తల్లి మీద కోపం, పెంచిన తండ్రి మీద అనుమానంతో ఎటూ తేల్చుకునే స్థితిలో ఉన్న చార్లీన్ నమ్మకాన్ని ప్యాట్ ఎలా గెలుచుకోగలిగాడు? అన్నదే ఈ చిత్ర కథ. 2000 నాటి వైన్‌లాండ్ నవల ఆధారంగా దర్శకుడు పాల్ థామస్ అండర్సన్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. గతేడాది సెప్టెంబరు 26న వార్నర్ బ్రదర్స్ నిర్మాణ సంస్థ ఈ సినిమాను విడుదల చేసింది. బాక్సాఫీసు వద్ద కాసుల వర్షం కురిపించకపోయినా.. అండర్సన్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాగా నిలిచింది. అటు విమర్శకుల ప్రశంసలతో పాటు అనేక పురస్కారాలు సాధించింది. తాజాగా జరిగిన ప్రతిష్ఠాత్మక ఆస్కార్ అవార్డుల్లో మొత్తం 13 విభాగాల్లో ఈ సినిమా నామినేషన్లలో నిలిచింది. ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ సహాయ నటుడు, ఉత్తమ అడాప్టెడ్ స్క్రీన్‌ప్లే, ఉత్తమ క్యాస్టింగ్, ఉత్తమ ఎడిటింగ్ విభాగాల్లో ఆరు పురస్కారాలు అందుకుంది. తండ్రి పాత్రలో లియో తన బిడ్డ కోసం పడే తపన ప్రేక్షకులను కంటతడి పెట్టిస్తుంది. ప్రస్తుతం ఈ సినిమా హాట్‌స్టార్, అమెజాన్ ప్రైమ్ వీడియోలో అందుబాటులో ఉంది.




Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD .. PRGI No- APTEL/25/A2739, Cell- 9963496956, 7382712780.